ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీకాకుళం
జిల్లా వార్తలు
ఆదివారం 19 జనవరి 2025



రేపటి నుంచి పశు ఆరోగ్య శిబిరాలు

శ్రీకాకుళం కలెక్టరేట్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా ఈ నెల 20 నుంచి 31 వరకు ఉచిత పశు ఆరోగ్య శిబిరాలను నిర్వహిస్తున్నట్లు పశుసంవర్ధక శాఖ ఏడీ కె.రాజగోపాలరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరాల్లో పశువైద్య చికిత్సలు, గర్భకోశ వ్యాధులకు చికిత్స, వ్యాధి నిరోధక టీకాలు, నట్టల నివారణ మందుల పంపిణీ, పశువ్యాధి నిర్ధారణ పరీక్షలు, యాజమాన్యంపై శాస్త్రీయ అవగాహన సదస్సులను నిర్వహిస్తామన్నారు. రోజుకొక మండలంలోని రెండు గ్రామాల్లో నిర్వహించనున్న ఈ శిబిరాలను పాడిరైతులు సద్వినియోగించుకోవాలని కోరారు.



ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే శంకర్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కలమట వెంకటరమణ

తెలుగువారి ఆత్మగౌరవానికి ప్రతీక.. ఎన్టీఆర్

- జిల్లావ్యాప్తంగా వర్ధంతి కార్యక్రమాలు
- పేదలకు దుస్తుల పంపిణీ
- రక్తదాన శిబిరాల నిర్వహణ

అరసవల్లి, జనవరి 18(ఆంధ్రజ్యోతి): తెలుగు వారి ఆత్మగౌరవానికి ప్రతీక స్వర్గీయ నందమూరి తారక రామారావు అని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కలమట వెంకటరమణ పేర్కొన్నారు. ఎన్టీఆర్ వర్ధంతిని పురస్కరించుకుని జిల్లావ్యాప్తంగా టీడీపీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు నివాళులర్పించారు. ఎన్టీఆర్ స్ఫూర్తి ప్రదాత అని, ఆయనను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా శ్రీకాకుళంలోని ఏడురోడ్ల జంక్షన్ వద్ద, 80 అడుగుల రోడ్డులోని జిల్లా పార్టీ కార్యాలయంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గొండు శంకర్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కలమట వెంకటరమణ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీని స్థాపించిన 8 నెలల్లోనే రికార్డు మెజారిటీతో గెలిచి ముఖ్యమంత్రి పీఠాన్ని కైవసం చేసుకుని, ప్రపంచానికి తెలుగువాడి ఘనతను చాటి చెప్పిన ఘనుడు.. ఎన్టీఆర్ అని కొనియాడారు. సంక్షేమ పథకాలకు ఆయనే ఆద్యుడని పేర్కొన్నారు. ఆయన క్రమశిక్షణ, కార్యదక్షత, దీక్ష, పట్టుదల నేటి తరానికి ఆదర్శమని తెలిపారు. ఇటు సినిమా, అటు రాజకీయ రంగాల్లో తనదైన చెరగని ముద్ర వేసిన మహనీయుడు అని ప్రశంసించారు. ఆయన తెలుగు బిడ్డగా పుట్టడం మనందరికీ గర్వకారణమన్నారు. ఎన్టీఆర్‌కు భారతరత్న ఇచ్చి గౌరవించాలని కోరారు. అలాగే ఏడురోడ్ల జంక్షన్ వద్ద పేదలకు చీరలు పంపిణీ చేశారు. జిల్లా పార్టీ కార్యాలయంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు పీఎంజే బాబు, శీర రమణయ్య, అరవల రవీంద్ర, సింతు సుధాకర్, పాండ్రంకి శంకర్, అంబటి లక్ష్మీరాజ్యం, కొమ్మనాపల్లి. వెంకటరామరాజు, పేరిశెట్టి శ్రీనివాస్, మాదారపు వెంకటేష్, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

పరిశుభ్రత పాటించాలి

- గ్రామాల్లో అధికారులదే బాధ్యత: కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్
- వాడవాడలా 'స్వచ్ఛ ఆంధ్ర.. స్వచ్ఛ దివస్' నిర్వహణ

నరసన్నపేట, జనవరి 18(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పిలుపునిచ్చారు. 'స్వచ్ఛ ఆంధ్ర.. స్వచ్ఛ దివస్' కార్యక్రమంలో భాగంగా శనివారం వాడవాడలా పారిశుధ్య నిర్వహణ చేపట్టారు. నరసన్నపేటలో ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తితో కలిసి ఈ కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభించారు. తహసీల్దార్ కార్యాలయంలో చెత్త మొక్కలను, చెత్తను తొలగించారు. జర్నలిస్టు కాలనీలో పొడిచెత్త- తడిచెత్త ఏరివేతను పరిశీలించారు. ప్రధాన రహదారి, గ్రంథాలయం వెనుక భాగంలో డ్రైనేజ్‌ల్లో సింక్ ఎక్కువగా ఉండడంతో అధికారుల తీరుపై మండిపడ్డారు. 'గ్రామాల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యమిచ్చేలా అధికారులు బాధ్యత వహించాలి. ప్రభుత్వ కార్యాలయాలతోపాటు పంచాయతీలు కూడా పరిశుభ్రంగా ఉంచాలి' అని కలెక్టర్ ఆదేశించారు. ఇందిరానగర్ కాలనీలో అండర్ డ్రైనేజ్ వ్యవస్థను కలెక్టర్ పరిశీలించారు. అండర్ డ్రైనేజ్ వ్యవస్థ ద్వారా నరసన్నపేట మోడల్ పట్టణంగా నిలుస్తుందన్నారు. ఇందుకోసం అవసరమయ్యే నిధులు మంజూరు చేస్తామని తెలిపారు. అలాగే వైసీపీ హయాంలో ధ్వంసం చేసిన ఎర్రన్నాయుడు చిల్డ్రన్ పార్కును కూడా పరిశీలించారు. పారిశుధ్య నిర్వహణపై అధికారులు, పంచాయతీ సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు.

- శ్రీకాకుళం నుంచి వస్తుండగా మార్గమధ్యలో జమ్ము జంక్షన్ వద్ద చెత్తను చూసి కలెక్టర్ కారు దిగారు. అక్కడ ఉన్న పండ్ల దుకాణాల యాజమానులు పిలిచి.. చెత్తను తొలగించారు. చెత్తను డ్రైనేజ్‌లో వేయరాదని సూచించారు.

- ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి మాట్లాడుతూ.. నరసన్నపేటలో తడి.. పొడిచెత్త వేరుచేసి పంచాయతీకి ఆదాయం వచ్చే మార్గంవైపు ప్రభుత్వం దృష్టి సారిస్తోందన్నారు. పరిశుభ్రత పాటించేవారికి బహుమతులు ప్రదానం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో డీపీవో భారతి సౌజన్య, తహసీల్దార్ ఆర్.సత్యనారాయణ, ఆర్‌అండ్‌బీ డీఈఈ సత్యనారాయణ, ఎంపీడీవోలు నిశ్చల, మధుసూదనరావు, ఏఈలు బగ్గు నర్సింగరావు, శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ సాసుపల్లి కృష్ణబాబు, మాజీ సర్పంచ్‌లు ఉణ్న రాజశ్రీ, చిట్టిబాబు, టీడీపీ నేతలు పాల్గొన్నారు.



తహసీల్దార్ కార్యాలయంలో పిచ్చిమొక్కలను తొలగిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

ఎత్తిపోతలకు ఎదురుచూపు!

- మెళియాపుట్టి మండలం కొసమాళ గ్రామ సమీపంలో మహేంద్రతనయ నదిపై టీడీపీ ప్రభుత్వ హయాంలో ఎత్తిపోతల పథకాన్ని నిర్మించాలని నిర్ణయించారు. 535 ఎకరాలకు సాగునీరు అందించేందుకుగానూ 2019లో రూ.378కోట్లు అంచనా వ్యయంతో అధికారులు ప్రతిపాదనలు రూపొందించారు. ప్రభుత్వానికి నివేదిక అందజేశారు. ఈ ఎత్తిపోతల పథకానికి అప్పటి ఎమ్మెల్యే కలమట వెంకటరమణమూర్తి శంకుస్థాపన కూడా చేశారు. కాగా.. తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం.. ఎత్తిపోతల పథకాలకు నిధులు మంజూరు చేయలేదు. దీంతో పనులు నిలిచిపోయాయి. ప్రస్తుత కూటమి ప్రభుత్వంపైనే రైతుల ఆశలు కనిపిస్తున్నాయి.



నడసందరలో ఎత్తిపోతల పథకం శిలాఫలకం ఇలా.. (ఫైల్)

- ప్రతిపాదనలకే పరిమితం
- నిధులు మంజూరు చేయని వైసీపీ ప్రభుత్వం
- గత ఐదేళ్లూ రైతులకు తప్పని ఇక్కట్లు
- కూటమి ప్రభుత్వంపైనే ఆశలు

మెళియాపుట్టి, జనవరి 18(ఆంధ్రజ్యోతి): జిల్లాలో నాగావళి, వంశధార, మహేంద్రతనయ, బాహుదా వంటి నదులున్నా.. రైతులకు ఏటా సాగునీటి ఇబ్బందులు తప్పడం లేదు. ఈ నేపథ్యంలో రైతులకు సాగునీరు అందించాలనే ఉద్దేశంతో టీడీపీ ప్రభుత్వ హయాంలో 2019లో ఎత్తిపోతల పథకాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. నదుల్లో ఉన్న నీటిని సద్వినియోగం చేసేలా ఎత్తిపోతల పథకాలు నిర్మించాలని భావించారు. ఈ మేరకు జిల్లాలోని నరసన్నపేట మండలం మడపాం, గార మండలం అంబళ్లవలస, మెళియాపుట్టి మండలంలో కొసమాళ, వసుంధర, నడసందర, రట్టిని, టెక్కలిలో ఆది-ఆంధ్రావీధిలో ఎత్తిపోతల పథకాల ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. సుమారు 8,149 ఎకరాలకుగానూ రూ.6,852 కోట్లతో నీటిపారుదలశాఖ అధికారులు ప్రతిపాదనలు రూపొందించి ప్రభుత్వానికి నివేదిక పంపారు. నిధులు మంజూరు చేసే సమయంలో సార్వత్రిక ఎన్నికలు సమీపించాయి. దీంతో హడావుడిగా పలు ఎత్తిపోతల పథకాలకు అప్పట్లో శంకుస్థాపనలు చేశారు. కానీ, తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఈ ఎత్తిపోతల పథకాల నిర్మాణానికి నిధులు మంజూరు చేయలేదు. దీంతో గత ఐదేళ్లు పనులు నిలిచిపోయాయి. శివారు భూముల రైతులకు పూర్తిస్థాయిలో సాగునీరు అందక ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. సాగునీటి రంగానికి నిధులు విడుదల చేయక పోవడంతో చెరువుల మరమ్మతులు లేక నీటి నిల్వలు తగ్గాయి. అలాగే నిర్మించిన ఎత్తిపోతల పథకాల నిర్వహణ కూడా గాలికొదిలేశారు. దీంతో రైతులు చందాలు వేసుకుని.. విద్యుత్ బిల్లుల ఖర్చులతోపాటు నిర్వహణ చేపట్టేవారు. ఎత్తిపోతల పథకాలు లేక, సాగునీటి వనరులు కూడా సక్రమంగా లేక వర్షాభావ పరిస్థితుల్లో తమకు ఇబ్బందులు తప్పడం లేదని రైతులు వాపోతున్నారు. నదుల్లో నీరు ఉన్నా.. వృథాగా పోయి సముద్రంలో కలుస్తోందని పేర్కొంటున్నారు. ఏటా వర్షాలపైనే ఆధారపడాల్సి వస్తోందని పేర్కొంటున్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వమైనా స్పందించి గతంలో ప్రతిపాదనలు రూపొందించిన ఎత్తిపోతల పథకాల నిర్మాణాలు చేపట్టాలని కోరుతున్నారు.

- మెళియాపుట్టి మండలం నడసందర, వసుంధర, రట్టిని గ్రామాలకు సైతం ఎత్తిపోతల పథకాలు ప్రతిపాదించి.. శంకుస్థాపనలు చేశారు. నడసందరలో 185 ఎకరాల అయుకట్టుకు గాను రూ.175 కోట్లు, వసుంధరలో 430 ఎకరాలకు రూ.308 కోట్లు, రట్టినిలో 260 ఎకరాలకు రూ.220 కోట్లు ప్రతిపాదనలు రూపొందించారు. ప్రభుత్వానికి నివేదికలు పంపారు. కానీ కార్యరూపం దాల్చలేదు.



వృథాగా పోతున్న మహేంద్రతనయ నది నీరు

నిధులు లేక.. పనులు జరగక

- అంబళ్లవలస 'ఎత్తిపోతల' ద్వారా అందని సాగునీరు

7లో

అన్నీ పట్టుకెళ్లరు.. ఒకటో, రెండో అంతే!

- తాళాలు ఇంటి బయట పెట్టే వారే టార్గెట్
- పోలీసులకు చిక్కిన ఇద్దరు గజ దొంగలు
- మూడు జిల్లాల్లో 32 ఇళ్లలో దొంగతనం
- రూ.84.5 లక్షల బంగారు ఆభరణాల స్వాధీనం

అనగనగనగా ఇద్దరు దొంగలు.. ముందుగా రెక్కీ నిర్వహిస్తారు. పనిమీద వెళ్తూ తాళాలు ఇంటి బయటపెట్టే వారిని గమనిస్తారు. అలాంటి ఇళ్లనే తమ టార్గెట్‌గా చేసుకుంటారు. తాళాలు తీసి లోపలకు వెళ్తారు. బీరువాలన్నీ సోదా చేస్తారు. నగలు కనిపిస్తే అన్నీ ఎత్తుకెళ్లరు. ఒకటో, రెండో తీసుకుని మిగతావన్నీ అక్కడే పెట్టేసి వెళ్తారు. ఇలాంటి విచిత్రమైన దొంగలను జిల్లా పోలీసులు పట్టుకున్నారు. ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా మూడు జిల్లాల్లో 32 చోట్ల, రాష్ట్రంలో 30 చోట్ల వీరు చోరీలకు పాల్పడ్డారు.



స్వాధీనం చేసుకున్న నగలను పరిశీలిస్తున్న ఎస్పీ, ఇతర పోలీసు అధికారులు

శ్రీకాకుళం రూరల్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): ఇద్దరు గజ దొంగలను జిల్లా పోలీసులు పట్టుకున్నారు. వారి నుంచి రూ.84.44 లక్షల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఈ వివరాలు వెల్లడించారు. విజయనగరం జిల్లా చీపురుపల్లి మండలం పత్తికాయలవలసకు చెందిన పున్నాన రాంబాబు.. విజయవాడలోని తన అత్త ఇంట్లో ఉంటూ ఇంటర్మీడియట్ చదివాడు. అక్కడే క్రికెట్ కోచింగ్ తీసుకున్నాడు. కాగా.. రంజీకి ఎంపిక కాకపోవడంతో చెడువ్యసనాలకు బానిసై నేరాలకు పాల్పడుతుండే వాడు. ఈ క్రమంలో విజయవాడ, గుంటూరు, ఎస్.కోట, రాజాం, విజయనగరం, చీపురుపల్లి, రణస్థలం, లావేరుతోపాటు రాష్ట్రంలో పలు పోలీసు స్టేషన్ల పరిధిలో 30కిపైగా కేసుల్లో జైలుకు వెళ్లాడు. 2022 జూన్‌లో అరెస్ట్ అయి 2024 జనవరి 10న విశాఖపట్నం సెంట్రల్ జైలు నుంచి విడుదలయ్యాడు. జైలులో రాంబాబుకి.. జి.సిగడాం మండలం గెద్ద కంచరాం (మిగతా 7వ పేజీలో..)

అన్నీ చవక.. చవక!

- అల్లం కిలో రూపాయే.. కరివేపాకు కూడా..
- కొత్తిమీర, కారెట్, మిర్చి, బీన్స్ కూడా అంతే..
- కస్తూర్బా, మోడల్ స్కూళ్లకు ఈ రేట్లతోనే సరఫరా
- టెండర్లు ఖరారు చేసిన ఉన్నతాధికారులు
- ఇంత తక్కువకు ఎలా ఇస్తారో పట్టించుకోకుండా..
- విద్యార్థులు అర్ధాకలితో అలమటిస్తే బాధ్యులెవరు?
- వ్యవహారం మంత్రి నారా లోకేష్ దృష్టికి..?

6లో



భవన నిర్మాణం.. ఇక సులభతరం

- మున్సిపాలిటీ పరిధిలోకే అనుమతులు
- సింగిల్‌విండోకు శ్రీకారం చుట్టిన కూటమి ప్రభుత్వం
- కమిషనర్ పరిధిలోకి బహుళ అంతస్తుల భవనాలు



పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటి వ్యూ..

పలాస, జనవరి 18(ఆంధ్రజ్యోతి):

- నాగభూషణరావు అనే వ్యక్తి తన స్థలంలో ఐదు అంతస్తుల భవనం కట్టాలని ప్లాన్ అప్రూవల్ కోసం స్థానిక మున్సిపల్ కార్యాలయానికి వెళ్లారు. ఇక్కడ నాలుగు అంతస్తుల వరకే తమ పరిధి ఉందని, మిగిలిన అంతస్తులకు సుడా, ఉడాకు వెళ్లి అనుమతులు తెచ్చుకోవాలని అధికారులు సెలవిచ్చారు. సదరు నిర్మాణదారుడు అక్కడకు వెళ్లి ఎన్నో వ్యయ, ప్రయాసలు పడినా అనేక కొర్రీలు పెట్టి తిరిగి పంపించడంతో తీవ్ర అసంతృప్తితో ఉన్నారు.

ఇది ఒక్క నాగభూషణరావు సమస్య కాదు. పలాస-కాశీబుగ్గ, ఇచ్ఛాపురం, ఆమదాలవలస మున్సిపాలిటీలో భవననిర్మాణదారుల పరిస్థితి కూడా ఇంతే. అదనంగా మరో అంతస్తు కట్టుకుందామన్నా స్థానికంగా ఉన్న మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ సిబ్బంది వల్ల కాదు. విశాఖపట్నం, శ్రీకాకుళం ఉడా, సుడా ఇంజనీరింగ్ అధికారులను సంప్రదించి పనులు అతికష్టంపై చేయించుకోవాల్సి వచ్చేది. ఇది గత పరిస్థితి. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత పట్టణాభివృద్ధిశాఖ మంత్రి కె.నారాయణ ఎంతో ముందుచూపుతో మున్సిపాలిటీల్లో భవన నిర్మాణ అనుమతులు సులభతరం చేయడానికి కసరత్తు చేసి తుది రూపం తీసుకువచ్చారు. ఐదు అంతస్తుల భవనాలకు స్థానికంగా కమిషనర్ పరిధిలోకి తీసుకువచ్చి అక్కడే నిబంధనల మేరకు అనుమతులు ఇవ్వడానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. ఈ విధానం త్వరాలోనే అమలులోకి రా నుంది. దీంతో బిల్డర్ల నుంచి సొంతంగా బహుళ అంతస్తులు నిర్మించుకునే వారందరికీ ఊరట కలగనుంది.

- ప్రభుత్వం సింగిల్ విండో విధానం ద్వారా ఒకే పోర్టల్‌లో అన్ని అనుమతులు పొందే అవకాశం కల్పించింది. గతంలో నిర్మాణదారులు అనుమతుల కోసం వేచి ఉండడంతో పాటు రూ.లక్షల్లో సమర్పించుకోవాల్సి వచ్చేది. దీనివల్ల గత వైసీపీ పాలనలో నిర్మాణరంగం పూర్తిగా కుదేలయింది. అక్రమ లేఅవుట్లు, భవనాలకు ఆస్కారం కల్పించింది. కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే దీనిపై దృష్టి సారించి సింగిల్‌విండో విధానానికి శ్రీకారం చుట్టడంతో పాటు నిర్మాణాలపై సంబంధిత మున్సిపాలిటీలకే బాధ్యతలు అప్పగించింది. అనుమతుల కోసం బిల్డర్లు పట్టణాల్లో ఆయా కార్యాలయాల చుట్టూ తిరగకుండా కమిషనర్ పరిధిలోనే ఈ సమస్యలు పరిష్కరించుకోవడానికి వెసులుబాటు కల్పించింది. శరవేగంతో అభివృద్ధి చెందుతున్న పలాస-కాశీబుగ్గ వంటి మున్సిపాలిటీల్లో బహుళ అంతస్తుల నిర్మాణాలకు నేరుగా ఆన్‌లైన్‌లో అనుమతులన్నీ పొందడానికి వెసులుబాటు కలిగింది.

నిర్మాణదారులకు ఎంతో ఊరటనిస్తుంది..



ఐదు అంతస్తుల భవనాల వరకూ ఇక్కడే అనుమతులు పొందడానికి పట్టణాభివృద్ధి శాఖ అనుమతులు ఇచ్చింది. దీనికి సంబంధించిన జీవో విడుదలయితే ఆ మేరకు నిర్మాణదారులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసిన వెంటనే నిబంధలలకు లోబడి అనుమతులు ఇస్తాము.

-ఎన్.రామారావు, కమిషనర్, పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ

పూర్వ విద్యార్థుల సమావేశానికి వెళ్లి వస్తూ..

- రోడ్డు ప్రమాదంలో ఆర్మీ జవాన్ దుర్మరణం
- లబోదిబోమంటున్న కుటుంబసభ్యులు

8లో

ఇదేనా 'స్వచ్ఛ దివస్'

- టెక్కలిలో ఎక్కడికక్కడే చెత్త
- వీధులన్నీ కంపేనంటూ స్థానికుల ఆవేదన

గిట్టుబాటుకాక.. ప్రోత్సాహం లేక

- అంతరించిపోతున్న రాట్నాలతో నూలు తయారీ

7లో

అబ్రహం కుంచె కదిపితే..

అపురూప చిత్రాలు ఆవిష్కృతం


మత్స్యకారుల చేపలవేట ఉట్టిపడేలా..


పక్షి ప్రతిబింబం


గ్రామీణ మహిళ ఆకృతిలో..


పెన్సిల్‌తో గీసిన ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రం

- చిన్నప్పటి నుంచే చిత్రలేఖనంపై మక్కువ
- ఎన్నో అవార్డులు, సత్కారాలు అందుకున్న చిత్రకారుడు కణితి


టెక్కలి, జనవరి 18(ఆంధ్రజ్యోతి): టెక్కలికి చెందిన కణితి అబ్రహం కుంచె కదిపితే అపురూప చిత్రాలు ఆవిష్కృతమవుతాయి. చిన్నప్పటి నుంచే చిత్రలేఖనంపై మక్కువ ఉండడం.. ఆయన్ను మంచి చిత్రకారుడిగా తీర్చిదిద్దింది. చిత్రలేఖనమే కాదు.. గానం, రచయిత, దర్శకుడిగా అబ్రహం రాణిస్తున్నారు. కనిపించే ప్రతి వర్ణాన్ని చిత్రంగా బంధిస్తుంటారు. 1989లో గుంటూరులో జరిగిన రాష్ట్రసాయి చిత్రలేఖనం పోటీల్లో ఆయన గీసిన మాతృప్రేమ చిత్రానికి అప్పటి మాజీ ఎంపీ ఎన్జీ రంగా నుంచి ప్రశంసాపత్రం, బంగారు ఉంగరం అందుకున్నారు. దేశభక్తులు, రాజకీయ నాయకులు, ప్రకృతి సౌందర్య చిత్రాలు, రాధాకృష్ణులు, శకుంతల, మేనకా, విశ్వామిత్రులు, అమృత కామిని, మాతృప్రేమ, పల్లెపడుచులు, జగన్మోహిని, ఎంకి.. ఇలా ఎన్నో వేలాది చిత్రాలు ఆయన కుంచె నుంచి జాలువారినవిగా చెప్పవచ్చు. సామాజిక రుగ్మతలపైన, ప్రజాచైతన్యంపైన ఆయన గీసిన చిత్రాలు ఆలోచింపజేస్తాయి. 2000 సంవత్సరంలో అప్పటి పోలీస్ యంత్రాంగం ఏర్పాటుచేసిన మైత్రి లోగో చిత్రం అబ్రహం గీశారు. నిరక్షరాస్యత, గిరిజన జీవన విధానం, గ్రామాల్లో కాలుష్య సమస్యలపై గీసిన చిత్రాలు కూడా ఆలోచింపజేశాయి. అలాగే ఎన్నికలు వేళ ఓటు విలువపై ఆయన వేసిన చిత్రం, కులవృత్తిదారుల జీవనశైలి చిత్రాలు ఎంతో గుర్తింపుతెచ్చిపెట్టాయి. కోడిగుడ్డుపైన వేసినవి, సబ్బుబిల్లలపైన గీసిన చిత్రాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. అలాగే పెన్సిల్‌తో డాట్ బొమ్మలు వేయడంలో ఆయన ఘనాపాటి. అబ్రహం స్వయం కృషితో 1980 నుంచి చిత్రలేఖనంలో అనేక చిత్రాలు వేయగలిగారు. ఈయన వేసిన చిత్రాలను ఎంతోమంది సేకరించి శుభ కార్యక్రమాలకు జ్ఞాపికలుగా ఇస్తుండడం పరిపాటి.

ఆర్ట్ గ్యాలరీ ఏర్పాటు చేయాలని ఉంది



నేను వేసిన చిత్రాలకు ఆర్ట్ గ్యాలరీ ఏర్పాటు చేయాలని ఉంది. అందుకు చిత్రకారులకు ప్రోత్సాహం అవసరం. చాలామంది చిత్రకారులు జీవనోపాధి లేక ఇబ్బందులు పడుతున్నారు. వారిని ప్రభుత్వం ఆదుకోవాలి.

- కణితి అబ్రహం, చిత్రకారుడు


గిరిజనుల కట్టూ..బొట్టూ..

విధిగా హెల్మెట్ ధరించండి

- జిల్లా ప్రధాన న్యాయాధికారి జునైద్ అహ్మద్ మౌలానా


మాట్లాడుతున్న జిల్లా న్యాయాధికారి జునైద్ అహ్మద్ మౌలానా

గుజరాతీపేట, జనవరి 18(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహన చోదకులు విధిగా హెల్మెట్ ధరించాలని జిల్లా ప్రధాన న్యాయాధికారి జునైద్ అహ్మద్ మౌలానా కోరారు. శనివారం శ్రీకాకుళంలోని జిల్లా కోర్టు సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతూ మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దన్నారు. రోడ్డు ప్రమాదాలు జరిగే సమయంలో హెల్మెట్ ప్రాణాలు కాపడుతుందని తెలిపారు. పైడి భీమవరం ఆంధ్రా ఆర్గానిక్ లిమిటెడ్, సూర్యమహల్, అరసవల్లిలోని మహిళా కళాశాల పంజాబ్ నేషనల్ బ్యాంక్ బ్రాంచ్ హెల్మెట్లను సమకూర్చగా, కోర్టులో విధులు నిర్వహిస్తున్న పలువురు ఉద్యోగులకు వాటిని అందజేశారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు, న్యాయాధికారులు పి.భాస్కరరావు, సీహెచ్ వివేక్ ఆనంద్ శ్రీనివాస్, ఎస్ఎం ఫణికుమార్, కె.కిషోర్‌బాబు, కె.శారదాంబ, కేవీఎల్ హిమబిందు, సీహెచ్ యుగంధర్, జె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రోడ్డుపై కూలిన మర్రిచెట్టు కొమ్మ



వజ్రపుకొత్తూరు, జనవరి 18(ఆంధ్రజ్యోతి): బెపల్లి- బాతుపురం గ్రామాల మధ్య ఆర్అండ్‌బీ రోడ్డుపై భారీ మర్రిచెట్టు కొమ్మ కూలింది. ఆ సమయంలో అటుగా ఎవరూ రాకపోవడంతో ఎలాంటి ప్రమాదం జరగలేదు. శనివారం మధ్యాహ్నం ఈ ఘటన చోటుచేసుకుంది. భారీ శబ్దం రావడంతో చుట్టుపక్కల తోటల్లో ఉన్న రైతులు వచ్చారు. విద్యుత్ వైర్లు కూడా చెట్టుకొమ్మ కింద ఉండడంతో వెంటనే విద్యుత్ సిబ్బందికి సమాచారం ఇవ్వగా.. సరఫరా నిలుపుదల చేశారు. రెండు గంటల పాటు వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం నెలకొంది. ఆర్అండ్‌బీ సిబ్బంది, స్థానికులు రోడ్డుపై ఉన్న కొమ్మలు తొలగించడంతో రాకపోకలు కొనసాగాయి.

ఎన్టీఆర్‌కు ఘన నివాళి


కవిటి: ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలవేస్తున్న ప్రభుత్వ విప్ బెందాళం అశోక్


నరసన్నపేట: ఆదివారంపేటలో ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి


అరసవల్లి: నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యేలు గుండ అప్పలసూర్య నారాయణ, లక్ష్మీదేవి దంపతులు

టీడీపీ వ్యవస్థాపకులు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు వర్ధంతి శనివారం ఆ పార్టీ శ్రేణులు జిల్లా వ్యాప్తంగా నిర్వహించారు. తెలుగువారి ఆత్మ గౌరవాన్ని కాపాడిన మహనీయుడని ఎన్టీఆర్ అంటూ పలువురు కొనియాడారు. ఈ సందర్భంగా పలు కార్యక్రమాలు నిర్వహించారు.

- ఆంధ్రజ్యోతి బృందం


రణస్థలం: ఎన్‌టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు



పాతపట్నం: రక్తదాతను అభినందిస్తున్న ఎమ్మెల్యే మామిడి గోవిందరావు


శ్రీకాకుళం కల్చరల్: సూర్యమహల్ జంక్షన్‌లో ఎన్‌టీఆర్ విగ్రహానికి ఎమ్మెల్యే గొండు శంకర్..


ఆమదాలవలస: రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కూన రవికుమార్

అన్నీ చవక.. చవక!



ఓ కూరగాయల సరఫరా కాంట్రాక్టర్.. ఆయన వెనుక ఓ కీలక ప్రజాప్రతినిధి! ఇంకేం.. అధికారులు ఏవీ పట్టించుకోకుండా టెండరు ఖరారు చేసేశారు. ఈ ధరలతో సరుకులు సరఫరా చేస్తారా? లేదా? అని కూడా చూడలేదు. విద్యార్థులు అర్ధాకలితో అలమటించరా? అన్న ఆలోచన కూడా రాలేదు మరి! సర్వశిక్షలో జరుగుతున్న ఈ అక్రమాల తంతు గురించి తెలిసిన వారు నివ్వెర పోతున్నారు.

- అల్లం కిలో రూపాయే.. కరివేపాకు కూడా..
- కొత్తిమీర, కారెట్, మిర్చి, బీన్స్ కూడా అంతే..
- కస్తూర్బా, మోడల్ స్కూళ్లకు ఈరేట్లతోనే సరఫరా
- టెండర్లు ఖరారు చేసిన ఉన్నతాధికారులు
- ఇంత తక్కువకు ఎలా ఇస్తారో పట్టించుకోకుండా..
- విద్యార్థులు అర్ధాకలితో అలమటిస్తే బాధ్యులెవరు?
- వ్యవహారం మంత్రి నారా లోకేష్ దృష్టికి..?

టెండర్‌లో కోట్ చేసిన ధరలు ఇలా..


కూరగాయ పేరు	తూకం	ధర (రూ.)
అల్లం	కిలో	1
కరివేపాకు	కిలో	1
కాళీఫ్లవర్	కిలో	1
కొత్తిమీర	కిలో	1
క్యారెట్	కిలో	1
గోంగూర	కిలో	1
పొడువు చిక్కుడు	కిలో	1
చుక్కకూర	కిలో	1
తోటకూర	కిలో	1
నిమ్మకాయ	కిలో	1
పచ్చిమిర్చి	కిలో	1
పాలకూర	కిలో	1
బీట్‌రూట్	కిలో	1
బీన్స్	కిలో	1
బీరకాయ	కిలో	1
మునగకాయలు	కిలో	1
ముల్లంగి	కిలో	1
కొబ్బరికాయ	ఒకటి	1
అరటికాయలు	కిలో	1
స్వీట్‌కార్న్	కిలో	1
అరటిపండు	ఒకటి	3
టమోటా	కిలో	15
ఆనపకాయ	కిలో	16
ఉల్లిపాయ	కిలో	20
క్యాబేజీ	కిలో	23
దొండకాయ	కిలో	25
బెండకాయ	కిలో	25
వంకాయ	కిలో	26
బంగాళాదుంప	కిలో	30

శ్రీకాకుళం, జనవరి 18(ఆంధ్రజ్యోతి): జిల్లాలో 25 కస్తూర్బా బాలికా విద్యాలయాలు, 13 మోడల్ స్కూళ్లకు కూరగాయలు, గుడ్డు, పాలు, కోడిమాంసం సరఫరా చేసేందుకు గత నెలలో టెండర్లు పిలిచారు. గత మూడేళ్ల గా సరుకుల సరఫరా చేసిన వ్యక్తే అత్యంత తక్కువ ధరలకు కోట్‌చేసి ఈ టెండరు దక్కించుకున్నారు. గుడ్డు, పాలు, చికెన్ విషయంలో పేరు మారినా.. అతని అనుచరుడే. కూరగాయల ధరల జాబితాను వెల్లడించేందుకు ఉన్నతాధికారుల నుంచి కిందిస్థాయి అధికారులు సైతం ససేమిరా అన్నారు. కానీ ఖరారైన టెండ రు వివరాలు.. అగ్రిమెంట్ జాబితా బయటకు వచ్చేసింది. ఇందులో ధరలు చూస్తే.. ఆశ్చర్యపో వాల్సిందే. ఇంత తక్కువ ధరకు ఎలా సరఫరా చేస్తారో అధికారులకే తెలియాలి. జనవరి 1 నుంచే కూరగాయలు, గుడ్డు, పాలు, చికెన్ సరఫరాకు అనుమతి ఇచ్చేశారు. ఆయా రేట్లకు నాణ్యమైన సరుకులు లభిస్తాయా? అన్నది సందేహమే.

సమగ్రశిక్షలో జరుగుతున్న ఈ తంతు తెలిసిన వారు నోరెళ్లబెడుతున్నారు.

జిల్లా వ్యాప్తంగా కస్తూర్బాలకు, మోడల్ స్కూళ్లకు ప్రతిరోజూ సుమారు 2 టన్నుల కూరగాయలు అవసరం. సరుకుల సరఫరాలో ఎక్కువ ధరలున్నవి అధిక కిలోలు బిల్లులలో చూపించేలా పథకం వేసుకున్నారని సమాచారం. ఇరవై రకాల కూరగాయల ధరలే రైతు బజారులో రూ.400పైబడి ఉంటే.. కేవలం ఇరవైకే (కిలో రూపాయికి చొప్పున) ఇస్తామని చెప్పడం గమనార్హం. అన్నింటికంటే స్కిన్‌లెస్ చికెన్ పత్రికల్లో ప్రచురితమైన ధర కన్నా కిలోకు రూ.50 తక్కువగా సరఫరా చేసేందుకు టెండరు ఖరారు చేశారు. పక్క జిల్లాలు అయిన విజయనగరం, పార్వతీపురం మన్యంలో కూడా కూరగాయలు గరిష్ఠంగా రూ.30 ఉండేవాటికి మాత్రమే అక్కడి ఉన్నత అధికార యంత్రాంగం టెండరు ను ఖరారు చేశారు. ఇక్కడ మాత్రం.. పేపర్‌లో మాత్రమే నిబంధనలు కనిపించేలా అధికారులు జాగ్రత్త వహించారు. ఈ విషయంలో ఓ కీలక ప్రజాప్రతినిధి హస్తముందని ఆరోపణలు ఉన్నాయి. అందుకే విద్యార్థులకు నష్టం కలిగించేవిధంగా వ్యవహరిస్తారని తెలిసినా టెండర్లను ఆమోదించారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అయితే ఈవిషయాన్ని కొంతమంది విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకువెళ్లినట్లు సమాచారం.





నిబంధనల ప్రకారమే టెండరు ఇచ్చాం

కస్తూర్బా, మోడల్ స్కూళ్లలో కూరగాయలు, పాలు, గుడ్లు, కోడిమాంసం సరఫరా చేసేందుకు టెండర్లు ఎల్1, ఎల్2, ఎల్3ని పరిశీలించి నిబంధనలు ప్రకారమే ఖరారు చేశాం. సరుకులు సక్రమంగా నాణ్యమైనవి సరఫరా చేయట్లేదని పాఠశాలల ప్రిన్స్‌పాళ్ల నుంచి ఫిర్యాదు అందితే కాంట్రాక్టరుపై చర్యలు తీసుకుంటాం. వారు ఇచ్చే సమాచారం ఆధారంగా చర్యలుంటాయి.

- ఫర్మాన్ అహ్మద్ ఖాన్, జాయింట్ కలెక్టర్

కలెక్టర్‌ను అవుతా

- చిన్నారి ఆశీష్
- బాలుడికి స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ప్రేరణ


ఆశీష్‌తో మాట్లాడుతున్న కలెక్టర్ పుండ్కర్

పలాస రూరల్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): లొత్తూరు ఆశ్రమ పాఠశాలలో 5వ తరగతి విద్యార్థి సవర ఆశీష్ తాను భవిష్యత్‌లో కలెక్టర్‌ను అవుతానని.. కలెక్టర్ చదువుకు తాను ఎంతో ఇష్టపడుతున్నానని చెప్పి కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను ఆశ్చర్యపరిచాడు. ఆ బాలుడికి ప్రేరణగా కలెక్టర్ అవాలంటే ఏం చదవాలో తెలుసా, కలెక్టర్ అవుతానంటున్నావే ఎవరు నీకు ప్రేరణ కలిగించారని ప్రశ్నలను ఆయన వేయడంతో ఆ చిన్నారి అన్నింటికీ సమాధానాలు చెప్పాడు. దీంతో కలెక్టర్ ఆనందం వ్యక్తంచేసి సంబంధిత బాలుడి ఇంటికి వెళ్లి తల్లిదండ్రులు, అక్కతో ముచ్చటించారు.

డ్రోన్లతో నిఘా

శ్రీకాకుళంక్రైం, జనవరి 18(ఆంధ్రజ్యోతి): నగరం పరిధిలోని నిర్మానుష్య ప్రదేశాల్లో చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసేందుకు పోలీసు యంత్రాంగం డ్రోన్లతో నిఘా పెట్టింది. శనివారం వన్‌టౌన్ పరిధిలోని డచ్‌బంగ్లా, గుడివీధి, కంపోస్ట్ కాలనీ, దమ్మలవీధి, నాగావళి నదీ పరివాహక ప్రాంతాల్లో డ్రోన్ కెమెరాలతో పరిశీలించింది.

అన్నీ పట్టుకెళ్లరు.. ఒకటో, రెండో అంతే!

(ఐదో పేజీ తరువాయి)

గ్రామానికి చెందిన గిడిజాల కోటేశ్వరరావుతో పరిచయం ఏర్పడింది. వారిద్దరూ కలిసి జైలు నుంచి విడుదలైన తర్వాత కూడా చోరీలకు పాల్పడేవారు. ఏడాది కాలంలో మూడు జిల్లాల్లో 32 ఇళ్లల్లో చోరీలు చేశారు. ఎచ్చెర్ల పోలీసుస్టేషన్ పరిధిలో 2024లో 2, 2025లో 9, లావేరులో 3, శ్రీకాకుళం ఒన్‌టౌన్ పరిధిలో 4, రూరల్ పరిధిలో 2, గారలో 2, టూటౌన్‌లో 4, పొందూరులో 3, పోలాకిలో 1, విశాఖ సిటీ పీఎం పాలెంలో 2 చోట్ల ఇళ్లల్లో దొంగతనాలకు పాల్పడ్డారు. మొత్తం 1కేజీ 305 గ్రాములు(112 తులాల) బంగారు ఆభరణాలను దొంగిలించారు.

ఎచ్చెర్ల బాధితుల ఫిర్యాదుతో..

ఈ నెల 7న ఎచ్చెర్ల పరిధిలో ఓ ఇంట్లో ఐదున్నర తులాల బంగారు కాసులపేరు(హారం), ఒక తులం బంగారు చైన్ పోయినట్లు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు పోలీసులు విచారణ చేపట్టారు. ఈ నెల 17న ఎచ్చెర్ల మండలం అరిణాం అక్కివలస కూడలిలో అనుమానాస్పదంగా తిరుగుతున్న రాంబాబు, కోటేశ్వరరావును పోలీసులు పట్టుకుని విచారించగా అసలు విషయం బయటపడింది. మూడు జిల్లాల్లో 32 చోట్ల దొంగతనాలకు పాల్పడినట్లు వారిద్దరూ వద్ద అంగీకరించారు. పోలీసులు వారిని అరెస్టు చేసి.. వారి నుంచి రూ.84,44,800 విలువచేసే 1కేజీ 206.4 గ్రాముల బంగారు ఆభరణాలను పోలీసులు రికవరీ చేశారు. ఇంకామరో 250 గ్రాముల బంగారు ఆభరణాలు బ్యాంకులో తాకట్టులో ఉన్నాయని, వాటిని కూడా స్వాధీనం చేసుకుంటామని ఎస్పీ మహేశ్వరరెడ్డి తెలిపారు.

ముందుగా రెక్కీ..

తాళాలు బయటపెట్టేవారి ఇళ్లే లక్ష్యంగా.. రాంబాబు, కోటేశ్వరరావు దొంగతనాలకు పాల్పడేవారు. ఇళ్లను రెక్కీ చేసేవారు. ఇంట్లో ఉన్న వ్యక్తులు బయటకు వెళ్లేముందు ఇంటికి తాళం వేసి.. వాటిని ఎక్కడ పెట్టేవారో గమనించేవారు. కొంతమంది చెప్పుల స్టాండ్‌లో, మరికొందరు కిటికీల వద్ద, కరెంట్ మీటరు వద్ద తాళాలు పెట్టినట్టు గుర్తించేవారు. వారు బయటకు వెళ్లగానే ఆ తాళం తీసుకుని నేరుగా ఇంట్లోకి వెళ్లి.. బీరువా తెరిచి అందులో ఉన్న ఒకటో, రెండో ఆభరణాలను దొంగిలించేవారు. మళ్లీ యథావిధిగా తాళాలు ఆ చోట పెట్టేసి వెళ్లిపోయేవారు. ఇలా దొంగిలించిన బంగారాన్ని తెలిసిన వాళ్ల ద్వారా ముత్తూట్, ఫిన్‌కాప్ తదితర ఫైనాన్స్ సంస్థల్లో తనఖా పెట్టి డబ్బులు తీసుకుని జల్సాలు చేసేవారు. వీరు దొంగతనం చేసిన వారి ఇంట్లో ఇప్పటికీ చాలా మందికి చోరీ జరిగినట్టు తెలియదని.. ఇంట్లో వారే వస్తువులు ఎక్కడో పడేశారని అనుకుంటారని.. అదే ఈ దొంగల మోటివ్ అని ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి తెలిపారు. దీంతో దొంగతనం ఘటనలపై ఫిర్యాదులు కూడా రాలేదన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, తాళాలు వెంటే ఉంచుకోవాలని సూచించారు. ఏఎస్పీ పి.శ్రీనివాసరావు, శ్రీకాకుళం డీఎస్పీ సీహెచ్ వివేకానంద పర్యవేక్షణలో ఈ కేసును ఛేదించిన జేఆర్‌పురం సీఐ ఎం.అవతారం, శ్రీకాకుళం సీఐ పైడపునాయుడు, ఎస్సైలు సందీప్‌కుమార్, లక్ష్మణరావు, చిరంజీవి, మధుసూదన్‌రావుతో పాటు ఏఎస్ఐ వి.రమణ, హెచ్‌సి తారకేశ్వరరావు, కేకే సింగ్, పిసిలు శ్రీనివాసరావు, దివాకర్‌రావు, శేఖర్, గణేష్, జోగారావు, లక్ష్మణరావు, రమణ, సూరిబాబు, గొల్లారావు, ప్రసాద్‌ను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. క్యాష్ రివార్డులు అందజేశారు. సమావేశంలో ఏఎస్పీ కె.వి.రమణ డీఎస్పీ వివేకానంద, సీఐలు అవతారం, పైడపునాయుడు, ఇమ్మాన్యుయేల్ రాజు పాల్గొన్నారు.

గిట్టుబాటు కాక.. ప్రోత్సాహం లేక

● రాట్నాలతో నూలు తయారీ అంతరించిపోతున్న వైనం ● సాయంకోసం ఎదురుచూపులు ● చదికిలబడుతున్న చరఖాలు


నూలు వడుకుతున్న కంబకాయి మహిళలు

నరసన్నపేట, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం లేక, తయారీదారులకు గిట్టుబాటు కాకపోవడంతో నూలుతయారీచేసే చరఖాలు అంతరించిపోతున్నాయి. స్వాతంత్రోద్యమ కాలంలో సహాయ నిరాకరణ ఉద్యమంలో భాగంగా గాంధీజీ పిలుపు మేరకు విదేశీయ వస్త్రాలు బహిష్కరించిన విషయం విదితమే. దీంతో స్వదేశీయ వస్త్రాలు వాడకం పెంచేందుకు గ్రామీణ ప్రాంతాల్లో అప్పట్లోనే రాట్నాలు వెలిశాయి. ప్రస్తుతం ఆ రాట్నాల నిర్వాహకులకు నిర్వహణ భారంకావడం, గిట్టుబాటు లేకపోవడంతో మూలకుచేరాయి.

ఇదీ పరిస్థితి..

ఒకప్పుడు నరసన్నపేట నియోజకవర్గంలో ప్రతి పల్లెలోనూ రాట్నాలు కనిపించేవి. ప్రస్తుతం నరసన్నపేట మండలంలోని కంబకాయ, కరగాం, జలుమూరు మండలం యలమంచిలి, బలివాడలో మాత్రమే చరఖాలు కనిపిస్తున్నా యి. ఇక్కడ నూలు వడికే మహిళలు ప్రభుత్వం ఎటువంటి సదుపాయాలు కల్పించకపోవడంతో రానురాను రాట్నాలు మూలకు చేరుతున్నాయి. రెండు దశాబ్దాల కిందట గ్రామాల్లో విశ్రాంతి సమయంలో రాట్నాలపై నూలు వడకడం ద్వారా మహిళలు సంపాదించుకునేవారు. ప్రస్తుతం ముడిపత్తి ధర పెరిగినంతగా నూలుకు ధరలు లేకపోవడం, ఈ రంగానికి రాయితీలు లేకపోవడం వెరసి నూలు వడికే వారి సంఖ్య తగ్గిపోతోంది. చేనేత కార్మికులకు పింఛన్లు, ప్రత్యేక సదుపాయాలు కల్పించిన ప్రభుత్వాలు నూలు వడికే మహిళలకు ఎటువంటి పథకాలు ప్రవేశపెట్టకపోవడంతో గ్రామాల్లో రాట్నంపై నూలు వడికే విధానం కనుమరుగవుతోంది.

మహిళకు జీవనోపాధి

నరసన్నపేట నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో రెండు దశాబ్దాల కిందట ఇంటికో రాట్నం ఉండేది. గ్రామంలో చేనేతపై ఆధారపడే కుటుంబాలు లేకపోయినా ప్రత్తిని కొనుగోలు చేసి రాట్నంపై నూలు వడికేవారు వడికే నూలును సమీపం విక్రయ కేంద్రాల్లో విక్రయించి మహిళలు జీవనోపాధి పొందేవారు. ప్రస్తుతం నూలు నాణ్యత పెంచేందుకు కూడా వాతావరణం అనుకూలించకపోవడం, నూలులో కౌంట్ల సంఖ్య తగ్గడంతో మహిళలకు గిట్టుబాటు రాకపోవడంతో రాట్నాలు మూలనపడ్డాయి. రాట్నాంతో తయారీచేసే నూలు నాణ్యంగా ఉండడంతోపాటు సన్నంగా ఉంటుంది. దీంతో బట్టలు నేస్తే.. ఎక్కువ ధరలకు పలికేవి.

అక్కడక్కడ వినియోగం..

గ్రామీణ ప్రాంతాల్లో 50 ఏళ్ల దాటిన కొందరు మహిళలు పూర్వం తాము చేపట్టే వృత్తిని వదులుకోలేక రాట్నంపై నూలు వడుకుతున్నారు. నరసన్నపేట మండలంలోని కంబకాయి, చిన్నకరగాం, నర్సింగపల్లి తదితర గ్రామాలతోపాటు జలుమూరు మండలంలోని పలు గ్రామాల్లో రాట్నం ద్వారా నూలు వడికే విధానం కనిపిస్తోంది. ముడిపత్తి నుంచి గింజలు తీయడం, ఏకడం, పేకలు చేయడం వంటి పనులు కాలయాపనతోపాటు ఎంతో శ్రమతో కూడుకోవడంతో ప్రస్తుతం తరం మహిళలు వినియోగానికి ఆసక్తి చూపడం లేదు. ప్రభుత్వం గాంధీ ఆశయాల సాధనకు గ్రామాల్లో నూలు వడికే మహిళలకు ప్రత్యేకంగా పింఛన్లు ఇవ్వడంతోపాటు ఆర్థికసాయం చేస్తే చరఖాలకు పూర్వ వైభవం వచ్చే అవకాశముంటుందని నూలు వడికే పలువురు చెబుతున్నారు.

నిధులు లేక.. పనులు జరగక

●శివారు ఆయకట్టుకు అందని సాగునీరు ●ఇదీ అంబళ్లవలస ఎత్తిపోతల పథకం పరిస్థితి


ఎత్తిపోతల పథకం కోసం వేసిన శిలాఫలకం

గార, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): బైరి సాగునీటి కాలువ శివారు భూములకు సాగునీరు అందించేందుకు అంబళ్లవలస ఎత్తిపోతల పథకం ఏర్పాటుకోసం వేసిన శిలాఫలకం వెక్కిరిస్తోంది. ప్రధానంగా నిధులు లేకపోవడంతో పనులు ముందుకుసాగలేదు. అంబళ్లవలస వద్ద రూ.397 కోట్ల అంచనాతో వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎత్తిపోతల పథకం నిర్మాణానికి 2019 ఫిబ్రవరి 13న శంకుస్థాపన చేశారు. వంశధార నదిపై అంబళ్లవలస వద్ద ఎత్తిపోతల పథకం ఏర్పాటుచేసి కొర్ని, కొర్లాం తదితర శివారు గ్రామాల పరిధిలోని రెండు వేల ఎకరాలకు సాగునీరందించేందుకు గతంలో అప్పటి ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి కూడా భూమి పూజ చేశారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఎత్తిపోతల పథకం పనులపై దృష్టిసారించకపోవడంతో పనులు శిలాఫలకం స్థాయి దాటలేదు. శివారు భూములకు సాగు నీరందక పంటలు పండక ఇబ్బందిపడుతుండడంతో ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

అన్నక్యాంటీన్ పరిశీలన

ఆమదాలవలస, జనవరి 18(ఆంధ్ర జ్యోతి):ఆమదాలవలసలోని అన్న క్యాంటీన్‌లో భోజన సదుపాయం, వంట నాణ్యతను విశాఖపట్నం పురపాలక సంఘ రీజినల్ డైరెక్టర్ వి.రవీంద్రశనివారం పరిశీలించారు. అనంతరం మునిసిపల్ కమిషనర్ పి.బాలాజీ ప్రసాద్‌తో పాటు భోజనం చేశారు. కార్యక్రమంలో పురపాలక సిబ్బంది, మెప్మా సిబ్బంది, సచివాలయ సిబ్బంది, మహిళా సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ప్రథమ చికిత్సతో ప్రాణ రక్షణ

శ్రీకాకుళం కల్చరల్, జనవరి 18 (ఆంధ్ర జ్యోతి): ప్రథమ చికిత్సతో ప్రాణాలను రక్షించవచ్చని రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్ మోహన్‌రావు తెలిపారు. శనివారం శ్రీకాకుళంలోని రెడ్‌క్రాస్ భవనంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రథమ చికిత్సపై రెడ్‌క్రాస్ ప్రోగ్రాం మేనేజర్, ప్రథమ చికిత్స శిక్షకులు డాక్టర్ శ్రీకాంత్, గొలివి రమణ, కె.సత్యనారాయణ శిక్షణ నిర్వహించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సెక్రటరీ బలివాడ మల్లేశ్వరరావు, ఏవో నర్సింగరావు, మేనేజర్ గుణకరరావు, మేనేజింగ్ కమిటీ సభ్యులు ఎం.కళ్యాణ్ చక్రవర్తి, కళ్యాణ్, పి.చైతన్య కుమార్ పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

శ్రీకాకుళంక్రైం,జనవరి 18(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలోని పలుప్రాంతాల్లో పేకాట ఆడుతూ 13 మందిని పోలీసులు అరెస్టు చేశారు. ఒన్‌టౌన్ పోలీసుల కథనం మేరకు.. ఖాజీపేట సమీపంలో ఎనిమిది మంది బహిరంగ ప్రదేశంలో పేకాడుతూ టాస్క్‌ఫోర్స్ పోలీసులకు శనివారం రాత్రి పట్టుబడ్డారు. వీరి వద్ద రూ.9,945 నగదును ఒన్‌టౌన్ పోలీసులకు అప్పగించారు. వాంబేకాలనీ సమీపంలో చికెన్ కొట్టు వెనుక ఐదుగురు పేకాడుతుండగా టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. రూ.4280 నగదును స్టేషన్‌కు అప్పగించారు. ఎస్ఐ ఎం.హరికృష్ణ కేసు నమోదు చేశారు.

కానిస్టేబుల్ అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు


దేహదారుఢ్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

ఎచ్చెర్ల, జనవరి 18(ఆంధ్ర జ్యోతి): పోలీసు కానిస్టేబుల్ ఎంపిక ప్రక్రియలో భాగంగా ఎచ్చెర్లసాయుధ పోలీసు మైదానంలో నిర్వహిస్తున్న దేహదారుఢ్య పరీక్షలు శనివారం ముగిశాయి. గతనెల 30న ప్రారంభమైన ఈప్రక్రియ 13 రోజుల పాటు కొనసాగింది. 100, 1600 మీటర్ల పరుగు, లాంగ్ జంప్‌తో పాటు ఛాతీ, ఎత్తు కొలతలను ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి పర్యవేక్షణలో నిర్వహించారు. లాంగ్‌జంప్‌కు మినహా మిగిలిన విభాగాల పరీక్షలకు సెన్సార్‌లు వినియోగించారు. చివరిరోజున శనివారం నిర్ధేశించిన అభ్యర్థులతోపాటు అనివార్య కారణాల వల్ల హాజరుకాని అభ్యర్థులు కూడా హాజరయ్యారు. శనివారం 416 మంది అభ్యర్థులు హాజరుకావల్సి ఉండగా, 336 మంది హాజరయ్యారు. ఇందులో 204 మంది అర్హత సాధించారు. 13 రోజులపాటు జరిగిన ఈ పరీక్షల్లో మొత్తం 4,952 మంది అభ్య ర్థులు హాజరుకాగా,వీరిలో 2,951మంది రాత పరీక్షకు అర్హత సాధించారు. అయితే రాత పరీక్షకు అర్హతసాధించిన వారి వివరాలను అధికారికంగా ప్రకటించాల్సిఉంది.

నేటి నుంచి షిర్డీసాయి ఆలయ వార్షికోత్సవాలు

జి.సిగడాం, జనవరి 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆనందపురంలో వెలసిన షిర్డీసాయి ఆలయ 23వ వారికోత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభంకానున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.ఈనెల 26 వరకు జరగనున్న వార్షికోత్సవాల్లో వేదపండితుల వేదమంత్రాల నడుమ హోమాలు, సాయి సత్యవ్రతాలు, అభిషేకాలు, సత్సంగం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆలయం ప్రాంగణంలో నిర్మించిన 46 అడుగుల నాగసాయి, 100 అడుగుల మహాస్థూపం వార్షికోత్సవాలు కూడా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఓం సాయి, శ్రీసాయి, జయజయ సాయి నామాల గల కోటి పుస్తకాలను 100 అడుగుల సాయికోటి మహాస్థూపం వద్ద భక్తుల చేతులమీదుగా నిక్షిప్తం చేయనున్నట్లు పేర్కొన్నారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తును ఏర్పాటు చేస్తున్నారు.

21న ఉద్యోగ మేళా: పీడీ

శ్రీకాకుళం కలెక్టరేట్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని నిరుద్యోగులకు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, సీడాప్ సంయుక్తంగా ఈనెల 21న ఉద్యోగ మేళాను నిర్వహించనున్నట్లు డీఆర్డీఏ పీడీ పి.కిరణ్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీకాకుళం ప్రభుత్వ ఐటీఐ, పాతపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మేళాను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు సినర్జీస్ కాస్టింగ్ లిమిటెడ్ కంపెనీ ట్రైనీ టెక్నీషియన్, ఫోర్క్ లిఫ్ట్ ఆపరేటర్ పోస్టులకు 18- 35 సంవత్సరాల వయసుగల అభ్యర్థుల నుంచి దరఖాస్తులుఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. అలాగే అపోలో ఫార్మసీ 240 ఫార్మసిస్ట్, ఫార్మా ట్రైనర్ పోస్టులను భర్తీ చేయనుందని, ఈ పోస్టులకు ఫార్మసీ, పదో తరగతి నుంచి డిగ్రీ వరకు చదువుకున్న వారు అర్హులని, పేర్కొన్నారు. అవంతి ఫ్రోజెన్ ఫుడ్ కంపెనీ పదో తరగతి ఉత్తీర్ణులైన మహిళా అభ్యర్థులకు ఎంపికలు చేయనుందని తెలిపారు.

బ్యూటీపార్లర్‌లో శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఎచ్చెర్ల, జనవరి 18 (ఆంధ్రజ్యోతి):ఎచ్చెర్లలోని యూనియన్ బ్యాంకు గ్రామీణ ఉపాధి శిక్షణ సంస్థలో నిర్వహిస్తున్న స్వయం ఉపాధి కోర్సుల్లో భాగంగా బ్యూటీపార్లర్‌లో ప్రవేశానికి శిక్షణ ఇవ్వనున్నట్లు శిక్షణ కేంద్రం డైరెక్టర్ కల్లూరి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం నుంచి ప్రారంభించే ఈ ఈ కోర్సులో ప్రవేశానికిపదోతరగతి చదివి, 18నుంచి 45 సంవత్సరాల వయస్సు ఉన్న మహిళా అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. నెలరోజుల పాటు నిర్వహించనున్న ఈ కోర్సులో చేరిన వారికి ఉచిత భోజన సౌకర్యాలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు ఎచ్చెర్ల శిక్షణకేంద్రం వద్ద సంప్రదించాల్సిందిగా కోరారు.

సమష్టి కృషితోనే వర్సిటీ ప్రగతి: వీసీ

ఎచ్చెర్ల, జనవరి 18(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ మరింత ప్రగతి పథంలో పయనించాలంటే సమష్టి కృషి అవసరమని వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజని తెలిపారు. వీసీగా ప్రొఫెసర్ రజని బాధ్యతలు స్వీకరించి ఏడాది పూర్తికావడంతో వర్సిటీలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ప్రభుత్వ సహకారం, వర్సిటీ వర్గాల అంకిత భావంతో రానున్న రోజుల్లో వర్సిటీ మరింత అభివృద్ధి దిశగా నడవనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వర్సిటీ రెక్టార్ ప్రొఫెసర్ బి.అడ్డయ్య, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.సుజాత, ప్రిన్సిపాళ్లు డాక్టర్ ఎస్.ఉదయభాస్కర్, డాక్టర్ ఎం.అనూరాధ, డాక్టర్ సీహెచ్ రాజశేఖరరావు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురంలో నవోదయ పరీక్షలు

ఇచ్ఛాపురం, జనవరి 18(ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురంలో గల మూడు కేంద్రాల్లో శనివారం నవోదయ ప్రవేశ పరీక్షలు నిర్వహించారు. ప్రభుత్వ ఉన్నత, బాలికల ఉన్నత పాఠశాల, స్వర్ణభారతి కళాశాలలో మొత్తం 845 మందికి గాను 743 మంది విద్యార్థులు హాజరయ్యారు. మూడు కేంద్రాల్లో క్లస్టర్ లెవల్ అబ్జర్వర్లగా హేమంత్, కబీర్‌దాస్, సురేష్ బెహరా, సీఎస్‌లుగా ఎస్ విశ్వనాథం, ఎస్.విశ్వనాథం, తమ్మయ్య వ్యవహరించారు.

మదుపాంలో కోడె బండ్ల పోటీలు

జి.సిగడాం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మదుపాం దుర్గాదేవి యాత్ర పురస్కరించుకుని రెండో రోజు శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మ వారికి గాజులు, పూసలు, పసుపు కుంకుమలు చెల్లించారు. భక్తుల కోసం కోలాటంతో పాటు గ్రామంలో కోడెబండ్ల పోటీలను నిర్వహించారు.

ఎన్టీఆర్ ఆశయ సాధనకు కృషి

● తెలుగుదేశం పార్టీ ప్రజాప్రతినిధుల పిలుపు

దివంగత టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎన్టీఆర్ ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషిచేయాలని ఆ పార్టీ ప్రజాప్రతినిధుల పిలుపునిచ్చారు. శనివారం ఎన్టీఆర్ వర్థంతి పురస్కరించుకుని విగ్రహాలు, చి త్రపటాలకు టీడీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

● శ్రీకాకుళం కల్చరల్ జనవరి 18 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలోని సూర్యమహల్ జంక్షన్‌లో ఎన్టీఆర్ అభిమానసంఘం జిల్లా అధ్యక్షుడు బరాటం ఉదయ శంకర్ గుప్తా ఆధ్వర్యంలో నందమూరి తారకరామారావు విగ్రహానికి శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ నివాళులర్పించారు. అనంతరం కార్మికులకు దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లాటీడీపీ సాంస్కృతిక విభాగ అధ్యక్షుడు గుర్తు చిన్నారావు, పటణాధ్యక్షుడు మాదారాపు వెంకటేష్, పట్టణ కార్యదర్శి చిట్టి నాగభూషణరావు, పి.రమణమూర్తి, లొట్టి సూరిబాబు, కలగ గోపాల్, ఎస్.వి.రమణ మాదిగ, కొమర కమల పాల్గొన్నారు.

●కవిటి, జనవరి18(ఆంధ్రజ్యోతి): కవిటిలో పాతబస్టాండు ఆవరణలోని ఎన్టీఆర్ విగ్రహానికి ఎమ్మెల్యే/ప్రభుత్వ విప్ బి.అశోక్ పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు మణిచంద్రప్రకాష్, కాళింగకార్పొరేషన్ డైరెక్టర్ బి.చిన్నబాబు,నేతలు పి.కృష్ణారావు, ఎస్వీ రమణ, భీమారావురౌళో, బి.రమేష్, వి.రంగారావు, ఎ.మధు పాల్గొన్నారు.

●నరసన్నపేట/జలుమూరు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): నరసన్నపేటలోని ఆదివారంపేట, టీడీపీ కార్యాలయం, మడపాంలో ఎన్టీఆర్ విగ్రహానికి ఎమ్మెల్యే బగ్గు రమణ మూర్తి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు కింజరాపు రామారావు, శిమ్మ చంద్రశేఖర్, కాళింగ కార్పొరేషన్ చైర్మన్ రోణంకి కృష్ణంనాయుడు పాల్గొన్నారు. అలాగే జలుమూరు మండలం టెక్కలిపాడులో రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో తెలుగుయువత ప్రతినిధులు రక్తదానం చేశారు. రక్తదాతలను ఎమ్మెల్యే రమణమూర్తి అభినందించారు. టీడీపీ నేతలు వెలమల రాజేంద్రనాయుడు, దుంగ స్వామిబాబు, బగ్గు గోవిందరావు, పంచిరెడ్డి రామచంద్రరావు, పిరియా వెంకటరావు పాల్గొన్నారు.


శ్రీకాకుళం: హైదరాబాద్‌లో ఎన్టీఆర్ ఘాట్‌లో నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు విభూది సూరిబాబు, ప్రధాన విజయరామ్

●పాతపట్నం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): పాతపట్నం క్యాంపు కార్యాలయంలో ఎన్టీఆర్ విగ్రహానికి ఎమ్మెల్యే మామిడి గోవిందరావు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా లెజండరీ బ్లడ్ డొనేషన్ డ్రైవ్ నిర్వహించి 203 యూనిట్ల రక్త సేకరణ చేపట్టామన్నారు. పేదలకు దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు.

● శ్రీకాకుళం, జనవరి 18(ఆంధ్రజ్యోతి): జిల్లాకు చెందిన టీడీపీ నాయకులు హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ ఘాట్‌లో శనివారం నివాళి అర్పించారు. కార్య క్రమంలో శ్రీకాకుళం నగరానికి చెందిన టీడీపీ రాష్ట్ర సాధికారిక జంగమ సంఘ డైరెక్టర్ విభూది సూరిబాబు, జిల్లా ఐటీడీపీ అధ్యక్షులు ప్రధాన విజయరామ్, జిల్లాకు చెందిన సినీ, టీవీ నటుడు విభూది రాజేష్‌చంద్ర పాల్గొన్నారు.

రేపటికి పనులు పూర్తిచేయండి

●రథసప్తమి ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే శంకర్


రథసప్తమి ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గొండు శంకర్

అరసవల్లి, జనవరి 18(ఆంధ్రజ్యోతి):భక్తులకు ఇబ్బంది కలగకుండా యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టాలని, సోమవారానికి పనులు పూర్తి చేయాలని,సాధారణ భక్తులను దృష్టిలో ఉంచుకుని అందరికి స్వామి వారి దర్శనమయ్యేలా ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే గొండు శంకర్ కోరారు. అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో ఫిబ్రవరి 2,3,4 తేదీల్లో నిర్వహించే రథసప్తమి వేడుకల్లో భాగంగా ఉత్సవాల పనులు యుద్ధప్రాతిపదికన సాగుతున్నాయి. ఈ మేరకు గొండు శంకర్ శనివారం రాత్రి అధికారులతో కలిసి పనులను పరిశీలించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ రథసప్తమికి ఆలయ పరిసరాలతో పాటు శ్రీకాకుళం నగర సుందరీకరణ పనులు కూడా వేగవంతం చేశామన్నారు.

● క్రమశిక్షణ కలిగిన కార్యకర్తలే టీడీపీకి బలమని, వారికి పార్టీలో ఎప్పుడూ ప్రత్యేక గౌరవం, గుర్తింపు ఉందని ఎమ్మెల్యే గొండు శంకర్ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా కోటి సభ్యత్వ నమోదు పూర్తికావడంతో పార్టీ జిల్లా అధ్యక్షుడు కలమట వెంకటరమణ, పార్టీ శ్రేణులతో కలిసి శనివారం శ్రీకాకుళంలోని 80 అడుగుల రోడ్డులో గల జిల్లా పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు.

● గార మండలంలోని కొర్నికి చెందిన ఎన్ని శ్రీనివాసరావు అనారోగ్యంతో బాధపడుతుండడంతో ఆయన కుటుంబానికి ఎమ్మెల్యే గొండు శంకర్ శ్రీకాకుళంలోని టీడీపీ జిల్లా కార్యాలయంలో రూ.92వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేశారు.

●శ్రీకాకుళం రూరల్,జనవరి 18 (ఆంధ్రజ్యోతి): సింగుపురంలో నిర్మాణంలో ఉన్న నర్సింగ్ కళాశాల పనులు పూర్తి చేస్తామని ఎమ్మెల్యే గొండు శంకర్ తెలిపారు. సింగుపురంలో నిర్మాణంలో ఉన్న నర్సింగ్ కళాశాలను పరిశీలించారు.

బెల్లుపడ గ్రోయిన్ మరమ్మతుకు నివేదిక: ఏఈ

ఇచ్ఛాపురం, జనవరి 18(ఆంధ్రజ్యోతి): బాహుదా నదిలోని బెల్లుపడ గ్రోయిన్ మరమ్మతుకు ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామని ఇచ్ఛాపురం ఇరిగేషన్ ఏఈ మధుసూధన్‌పాణిగ్రాహి తెలిపారు. ఇటీవల కురిసిన వర్షాలకు గ్రోయిన్ పూర్తిగా దెబ్బతినడంతో బెల్లుపడ రైతులు ఫిర్యాదు చేశారు.ఈ మేరకుశనివారం బాహుదా నదిలో బెల్లుపడ గ్రోయిన్‌ను ఇరిగేషన్ అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా పాణిగ్రాహి మాట్లాడుతూ బెల్లుపడ గ్రోయిన్ దెబ్బతినడంతో పూర్తి స్థాయిలో మరమ్మతులకు సుమారుగా రూ.28 లక్షలు అవసరమని ప్రతిపాదనలు అధికారులకు పంపిస్తామని తెలిపారు. కార్యక్రమంలో నీటి సంఘ అధ్యక్షుడు కె.ధనుంజయరెడ్డి, ఉపాధ్యక్షుడు దుక్క రామారావు, రైతులు పాల్గొన్నారు.

బీటీ రోడ్డు పనుల నాణ్యతపై నిలదీత

ఇచ్ఛాపురం రైలు నిలయం సమీపంలో జరుగుతున్న బీటీ రోడు పనులను టీడీపీ నాయకులు శనివారం పరిశీలించారు.పనులు నాణ్యతతో లేకపోవడంతో సంబంది త ఏఈ, కాంట్రాక్టర్‌ను నిలదీశారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు కాళ్ల ధర్మారావు, నందికి జాని, రాష్ట్ర కార్యదర్శి సాలిన డిల్లీ, మాజీ ఎంపీపీ డి.డిల్లీరావు, కౌన్సిలర్లు, కాళ్ల దిలీప్, పత్రి తవిటయ్య, లీలారాణి, దర్మరాజు,సహదేవ్, పద్మనాభం పాల్గొన్నారు.

సమగ్రాభివృద్ధి సాధనే లక్ష్యం

● ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవికుమార్

ఆమదాలవలస, జనవరి 18 (ఆంధ్ర జ్యోతి): ఉపాధి హామీ పథకం ద్వారా సమగ్రాభివృద్ధి సాధించ డమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ తెలిపారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ తమ్మినేని శారద అధ్యక్షతన జరిగిన కార్య క్రమంలో మండల పరిషత్ 2024-25 సవరణ బడ్జెట్‌తో పాటు 2025-26 అంచనా బడ్జెట్‌ను ఆమోదించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రవికుమార్ 2023 సంవత్సరం నుంచి మండల పరిషత్ బడ్జెట్ పూర్తి వివరాలు, రాబడులు, ఖర్చులు, మిగులు బడ్జెట్ తెలియజేయాలని కోరారు. పూర్తి వివరాలతో కూడిన నివేదిక అందిస్తామని ఎంపీడీవో ఆర్.వెంకటరావు తెలిపారు. ఎంపీపీ, జడ్పీటీసీ, ఎంపీటీసీలకు గౌరవ వేతనాలు కూడా వైసీపీ ఐదేళ్ల పాలనలో అందించకుండా మండల పరిషత్, పంచాయతీలో నిధులు కూడా దరి మళ్లించి గ్రామాభివృద్ధిని అడ్డుకున్నారని ఎమ్మెల్యే ఆరోపించారు. కార్య క్రమంలో జడ్పీటీసీ బెండి గోవిందరావు, మండల ప్రత్యేకాహ్వానితులు తమ్మినేని శ్రీరామ్మూర్తి టీడీపీ నాయకులు తమ్మినేని చంద్రశేఖర్, నూకరాజు, సనపల డిల్లీశ్వరరావు పాల్గొన్నారు.

మస్తర్లు కచ్చితంగా వేయాలి : పీడీ

గార, జనవరి 18 (ఆంధ్రజ్యోతి):ఉపాధి పథకం ద్వారా చేపడుతున్న పనులకు సంబంధించి మస్తర్లు కచ్చితంగా వేయకపోతే చర్యలు తప్పవని డ్వామా పీడీ సుధాకరరావు హెచ్చరించారు. శనివారం గారలో ప్రజా వేదిక కార్యక్రమం నిర్వహించారు. తొలుత శ్రీకూర్మంలో 3500 ఉపాధి వేతనదారులు ఉన్నారని, ఇద్దరు ఫీల్డ్ అసిస్టెంట్ సరిపోవడం లేదని, అదనంగా ఇద్దరు ఫీల్డ్ అసిస్టెంట్‌లను నియమించాలని వైఎస్ఎంపీపీ అందవరపు భాగ్యలక్ష్మి కోరారు. బందరువానిపేటలో పలువురికి జాబ్ కార్డులు లేక ఇబ్బందులు పడుతున్నారని ఆ గ్రామ పెద్దలు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ రఘురామ్, ఎంపీడీవో ఎస్.రామమోహనరావు, ఏపీడీ రాధ, ఏపీవో సంధ్యారాణి, ఏఈ గోవిందరావు పాల్గొన్నారు.

చికిత్సపొందుతూ మహిళ మృతి

బూర్జ,జనవరి 18(ఆంధ్ర జ్యోతి): సీతంపేటలోని ఆడలి వ్యూపాయింట్ చూసేందుకు వెళ్లి వస్తుండగా గాయపడిన ఓ వ్యక్తి చికిత్సపొందుతూ శనివారం మృతిచెందారు. బూర్జ మండలంలోని నీలంపేట, కురుంపేటకు చెందిన గ్రామస్థులు సీతంపేటలోని ఆడలి వ్యూపాయింట్ చూడడానికి ఆటోలో గురువారం సాయంత్రం వెళ్లారు. తిరిగి వస్తుండగా నీలంపేట మలుపు వద్దకు కురుంపేటకు చెందిన ఆటోను వెనుక వస్తున్న మరో ఆటో ఢీకొనడంతో లోయలో బోల్తాపడిన ఘటనలో పలువురికి గాయాలయ్యాయి. ఇందులో తీవ్రంగా గాయపడ్డ కురుంపేటకు చెందిన బొడ్డు యశోదమ్మను శ్రీకాకుళంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్సపొందుతూ శనివారం మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

క్రైం కార్నర్

పూర్వ విద్యార్థుల సమావేశానికి వెళ్లి వస్తూ..

- రోడ్డు ప్రమాదంలో ఆర్మీ జవాన్ దుర్మరణం
- లబోదిబోమంటున్న కుటుంబసభ్యులు



అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహిస్తున్న దృశ్యం (ఇన్‌సెట్‌లో) దుష్యంత్ (ఫైల్)

ఆమదాలవలస, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): పాలకొండ-శ్రీకాకుళం రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ ఆర్మీ జవాన్ దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. రేగిడి మండలం ఉంగరాడమెట్టలో ఆర్మీ జవాన్ గొర్లె దుష్యంత్ (చిన్ని) (26) స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్నాడు. సంక్రాంతిని పురస్కరించుకుని శుక్రవారం పాలకొండలో పూర్వ విద్యార్థుల సమావేశంలో పాల్గొని సాయంత్రం సొంతూరు ఆమదాలవలస మండలం దన్నానపేట ద్విచక్ర వాహనంపై వెళ్తున్నాడు. ఈ క్రమంలో ఆమదాలవలస, బూర్జ మండలాల సరిహద్దులో ఉప్పినివలస-అక్కులపేట వద్ద ద్విచక్ర వాహనం బోల్తాపడి అక్కడిక్కడే మృతి చెందాడు. ఈ ప్రమాదం జరిగిన వెంటనే చిన్ని మృతి చెందగా స్థానికులు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. తక్షణమే ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించినా అప్పటికే మృతి చెందాడు. ఈ విషయం తెలియడంతో ఉంగరాడమెట్ట, దన్నానపేటల్లో విషాదఛాయలు అలముకున్నాయి. చిన్ని తల్లిదండ్రులు గొర్లె జగన్నాథరావు, రమాదేవి కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. తండ్రి ఉంగరాడమెట్ట వద్ద ఓ ప్రైవేటు కంపెనీలో వెల్డర్‌గా పని చేయగా, తల్లి రమాదేవి గృహిణి కాగా, ఓ అన్నయ్య ఉన్నాడు. ఈ మేరకు బూర్జ ఎస్ఐ ఎం.ప్రవల్లిక కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. కాగా దన్నానపేటలో శనివారం దుష్యంత్ అంత్యక్రియలను అధికార లాంఛనాలతో జరిగాయి. బూర్జ, ఆమదాలవలస ఎస్ఐలు ప్రవల్లిక, బాలరాజు, పోలీస్ సిబ్బంది గాలిలోకి మూడు రౌండ్లు కాల్పులు జరిపి గౌరవవందనం చేశారు.

స్నేహితులతో కలిసి..

పాలకొండలోని ఓ ప్రైవేటు విద్యాసంస్థలో చిన్ని విద్యను అభ్యసించాడు. సంక్రాంతి సందర్భంగా శుక్రవారం పూర్వ విద్యార్థుల సమావేశం ఏర్పాటు చేసుకున్నారు. ఈ వేడుకల్లో పాల్గొన్న చిన్ని స్నేహితులతో సందడిగా గడిపాడు. అనంతరం దన్నానపేట బయలుదేరి వెళ్తుండగా ద్విచక్రవాహనం బోల్తాపడింది. సంక్రాంతి సెలవులు ముగియడంతో వీధుల్లో చేరేందుకు సిద్ధమవుతున్న తరుణంలో ఈ ఘటన చోటుచేసుకుంది.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

సరుబుజ్జిలి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపేట సమీపంలో శనివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో సన్నబోయిన చంద్ర శేఖర్ (25) మృతి చెందినట్లు ఎస్ఐ బి.హైమావతి తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు.. దుబాయిలో వెల్డింగ్ పనులు చేసుకుని చంద్రశేఖర్ జీవిస్తున్నాడు. సంక్రాంతికి స్వగ్రామం హిరమండలం మండలంలోని కొండ రాగోలు గ్రామానికి వచ్చాడు. ఆమదాలవలసలో ఉన్న తన స్నేహితుడిని కలవడానికి శనివారం సాయంత్రం ద్విచక్ర వాహనంపై వెళ్తున్నాడు. ఆ సమయంలో ఆమదాలవలస నుంచి సరుబుజ్జిలి వైపు వస్తున్న మరో ద్విచక్ర వాహనం ఎదు రెదురుగా ఢీకొనడంతో చంద్రశేఖర్ సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు. చంద్రశేఖర్ తండ్రి తిరుపతిరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాకుళం సర్వజన ఆసుపత్రికి మృతదేహాన్ని తరలించారు.

టెక్కలిలో మాజీ సైనికుడు..



ఢిల్లేశ్వరరావు (ఫైల్)

టెక్కలి, జనవరి 18(ఆంధ్రజ్యోతి): టెక్కలి మండలం గూడేం గ్రామానికి చెందిన మాజీ సైనికుడు జి.ఢిల్లేశ్వరరావు(90)శనివారం వేకువ జామున తీవ్ర అస్వస్థతకు గురై మృతి చెందారు. ఢిల్లేశ్వరరావు మృతి పట్ల టెక్కలి మండల మాజీ సైనిక సంఘం ప్రతినిధులు సంతాపం వ్యక్తం చేశారు. ఈ గ్రామానికి చెందిన తొలి సైనికుడిగా, అప్పట్లో ఇండో-పాక్ యుద్ధంలో కూడా పాల్గొన్నారు. ఈ ప్రాంతానికి తొలి సైనికుడిగా ఎందరికో ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. శనివారం అంత్యక్రియలు నిర్వహించారు. ఈయనకు భార్య విజయలక్ష్మి, ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

56 మద్యం సీసాలు స్వాధీనం

జలుమూరు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): తిలారు ఆర్ఎస్‌లో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అశోక్‌బాబు తెలిపారు. తనిఖీల్లో భాగంగా తిలారు ఆర్ఎస్‌లో తంగుడు వెంకటరమణ దుకాణంలో 56 మద్యం సీసాలను గుర్తించి స్వాధీనం చేసుకున్నామన్నారు. ఎటువంటి అనుమతులు లేకుండా మద్యం విక్రయించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

లభ్యం కాని తరుణ్ ఆచూకీ

వజ్రపుకొత్తూరు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): వజ్రపుకొత్తూరు గ్రామానికి చెందిన జంగం తరుణ్ శుక్రవారం సముద్రంలో స్నానానికి దిగి అలల ఉధృతికి గల్లంతైన విషయం తెలిసిందే. తరుణ్ ఆచూకీ కోసం శుక్ర, శని వారాల్లో ఎస్ఐ బి.నిహార్ ఆధ్వర్యంలో పోలీసులు, గ్రామస్థులు సముద్ర తీరంలో గాలించినా శనివారం రాత్రి వరకు ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో తరుణ్ కుటుంబ సభ్యులు ఆందోళనకు గురవుతున్నారు. రట్టి, బారువా తీరాల వరకు వెళ్లి గాలించి నట్లు ఎస్ఐ చెప్పారు. సముద్రం తీరాల్లోని గ్రామాలకు సమాచారం ఇచ్చామని పేర్కొన్నారు.

ఆంజనేయ విగ్రహ వ్యవస్థాపక కార్యదర్శి మృతి



శ్రీకాంత్ (ఫైల్)

నరసన్నపేట, జనవరి 18(ఆంధ్రజ్యోతి): ప్రపంచంలో ఎత్తైన మడపాంలోని 175 అడుగుల అభయాంజనేయ స్వామి విగ్రహ నిర్మాణ కమిటీ వ్యవస్థాపక కార్యదర్శి జాయి శ్రీకాంత్ (54) శనివారం ఆకస్మికంగా మృతి చెందారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. శ్రీకాంత్ వ్యక్తిగత పనులపై టెక్కలి వెళ్లగా అప్పటికే ఒంట్లో నలతగా ఉండడంతో టెక్కలిలోని ఒక ఆసుపత్రిలో వైద్యులకు చూపించేందుకు వెళ్లగా అప్పటికే వాంతులు కావడంతో మృతి చెందారు. సుమారు 14 ఏళ్లుగా అభయాంజనేయస్వామి విగ్రహ నిర్మాణానికి ఎనలేని సేవచేసి ఐదేళ్ల కిందట పూర్తి చేశారు. ఇతనికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. శ్రీకాంత్ కృషి మూలంగానే ప్రపంచంలో ఎత్తైన ఆంజనేయస్వామి విగ్రహ నిర్మాణం జరిగిందని స్థానికులు చెబుతున్నారు. శ్రీకాంత్ మృతి పట్ల ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, మాజీ ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, పలువురు స్థానికులు సంతాపం తెలిపారు.

టీడీపీ నాయకుడిపై దాడి.. కేసు నమోదు

నందిగాం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): సవరబాణాపురానికి చెందిన టీడీపీ నాయకుడు పైల బాబూరావుపై దాడి చేసిన ఘటనలో శనివారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ షేక్ మహ్మద్ ఆలీ తెలిపారు. బాబూరావు టీడీపీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనడంతో సహించలేక అదే గ్రామానికి చెందిన లఖినాన సూర్యనారాయణ దాడికి పాల్పడినట్లు తెలిపారు. వేరుశనగ పంటకు పొలంలో నీరు పెడుతుండగా సూర్యనారాయణ తనపై దాడి చేసి గాయపరిచాడని బాబూరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చెత్త రహిత గ్రామంగా లొత్తూరు

- సోలార్ వెలుగులకు చర్యలు
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



మెళియాపుట్టి: గోకర్ణపురంలో సచివాలయ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

పలాసరూరల్, జనవరి18 (ఆంధ్రజ్యోతి): లొత్తూరును చెత్త రహిత గ్రామంగా తీర్చిదిద్దాలని దీనికి ప్రజలంతా సహకరిస్తే సుందర గ్రామంగా తయారు చేసేందుకు చర్యలు తీసుకుంటానని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. శనివారం స్వచ్ఛఆంధ్ర-స్వచ్ఛ దివస్ సందర్భంగా గ్రామస్థులతో ఆయన మాట్లాడారు. వీధుల్లో రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటి వాటిని పరిరక్షించి అందంగా తీర్చిదిద్దాలని, చెత్త ఎక్కడా కనిపించకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవా లన్నారు. గ్రామంలో సవర సావిత్రి అనే మహిళ ఇంటికి వెళ్లి పలు అంశాలపై మాట్లాడారు. ఇంటి పెరటిలోకి వెళ్లి తోటను పరిశీలించి ఆనందం వ్యక్తం చేశారు. మీ ఇంటిని ఎంత అందంగా ఉంచుతున్నారో అలాగే గ్రామాన్ని కూడా ఉంచాలని, విద్యుత్ సమస్య లేకుండా సోలార్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటానన్నారు. చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలించి వర్మీ కంపోస్టు ఏ మేరకు తయారీ చేస్తున్నారు, ఎంతమేర వినియోగిస్తున్నారని నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్థానికులు గ్రామంలోని సమ స్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. పాఠశాలకు వంట గది, గెడ్డ బట్టికి రక్షణగోడ నిర్మాణం చేపట్టాలని కోరారు. సెల్‌టవర్ సక్రమంగా పనిచేయడం లేదని, దీంతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీవో గ్రంధి వెంకటేష్, తహసీల్దార్ ఎన్. కల్యాణ చక్రవర్తి, ఎంపీడీవో వసంత్‌కుమార్, పశువైద్య సంచాలకుడు చంద్రశేఖర్, టీడీపీ నాయకులు పీరికట్ల విఠల్, దువ్వాడ సంతోష్‌కుమార్, ఆశ్రమ పాఠశాల హెచ్ఎం ఎ.శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రత లోపిస్తే చర్యలు

మెళియాపుట్టి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పరిశుభ్రత లోపిస్తే చర్యలు తీసుకుంటామని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ స్పష్టంచేశారు. శనివారం గోకర్ణపురం గ్రామ సచి వాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. 'స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్' అమలు తీరును పరిశీలించారు. గ్రామ పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కలిగించాలన్నారు. గ్రామంలో పరిశు భ్రత లేకపోవడంతో సచివాయల సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణం గ్రామంలో పారిశుధ్య పనులు చేపట్టి దీనికి సంబంధించిన ఫొటోలను పంపాలని ఆదేశించారు. గ్రామానికి వంతెన నిర్మాణం చేపట్టాలని స్థానికులు కలెక్టర్‌ను కోరగా పరిశీలించి నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలని అన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ బి.పాపారావు, ఎంపీడీవో ప్రసాద్ పండా, పలు శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతలో రోల్ మోడల్ కావాలి: శంకర్



ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎమ్మెల్యే గొండు శంకర్

శ్రీకాకుళం రూరల్/శ్రీకాకుళం కల్చరల్/అరసవల్లి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): పరిశుభ్రతలో రాష్ట్రం దేశానికే రోల్ మోడల్‌గా నిల వాలని ఎమ్మెల్యే గొండు శంకర్ కోరారు. మండలంలోని కళ్లేపల్లిలోని సంప్రదాయ గురుకులం, శ్రీకాకుళం నగరంలోని తెలుగు ముస లయ్య కాలనీల్లో స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్‌ని నిర్వహించారు. కమిషనర్ ప్రసాద్, ఎంపీడీవో బి.శైలజ, ఈవోపీఆర్డీ సూర్యనారాయణ, టీడీపీ నాయకులు మూకళ్ల శ్రీనివాసరావు, సూరాడ సూర్యం, మైలపల్లి నర్సింహమూర్తి, దశరథ్, చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

- నందిగాం, జనవరి 18(ఆంధ్రజ్యోతి): గ్రామాలను స్వచ్ఛత గ్రామాలుగా తీర్చిదిద్ది ఆరోగ్య సమాజాన్ని స్థాపించాలని జడ్పీ సీఈవో శ్రీధర్ రాజా అన్నారు. శనివారం స్వచ్ఛఆంధ్ర, స్వచ్ఛదివస్‌లో భాగంగా మండల కార్యాలయ ఆవరణలో స్వచ్ఛత కార్యక్రమాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో టి.రాజారావు, తహసీల్దార్ పి.సోమేశ్వరరావు, ఏపీఎం మనోరత్నం, వైద్యాధికారులు అనితకుమారి, సుకన్య, అంజలి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా వ్యాప్తంగా స్వచ్ఛఆంధ్ర-స్వచ్ఛ దివస్

రాష్ట్రప్రభుత్వ ఆదేశాల మేరకు శనివారం జిల్లా వ్యాప్తంగా 'స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛదివస్' కార్యక్రమాలు నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాలు, ఆసుపత్రులు, పాఠశాలల ఆవరణలు పరిశుభ్రం చేసి మొక్కలు నాటారు. కార్యక్రమాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం: ఎంజీఆర్



అధికారులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు

పాతపట్నం, జనవరి 18(ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం సిద్ధిస్తుందని, దీనిని ప్రతి ఒక్కరూ ఆచరించాలని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. పాతపట్నంలో శనివారం స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివస్' నిర్వహించారు. ప్రతీనెలా 3వ శనివారం ఈ కార్యక్రమాన్ని చిత్తశుద్ధితో చేపట్టాలన్నారు. ఈ సందర్భంగా అధికారులు, నేతలతో ప్రతిజ్ఞ చేయించారు. కోర్టుకూడలి నుంచి సబ్‌జైల్ సిబ్బంది క్వార్టర్స్ వరకు పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి డా.మంచు కరుణాకరరావు తహసీల్దార్ ఎన్.కిరణ్ కుమార్, ఎంపీడీవో పి.చంద్రకుమారి తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ ఆంధ్రలో భాగస్వాములు కావాలి: అశోక్



కవిటి: పరిశుభ్రం చేస్తున్న ఎమ్మెల్యే అశోక్

కవిటి, జనవరి18 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఇచ్ఛాపురం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బి.అశోక్ కోరారు. కవిటి ప్రభుత్వాసుపత్రి ఆవరణలో స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్‌లో భాగంగా మొక్కలు నాటారు. అనంతరం సహలాల పుట్టుగలో నిర్మించిన రోడ్డును ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కె.మురళీ మోహనరావు, ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి, ఏపీడీ సీహెచ్ శ్రీనివాసరెడ్డి, ఏపీఎం గోవిందు, జనసేన నేతలు దాసరి రాజు, ఎల్.రాజేష్ పాల్గొన్నారు.

కార్యాలయాలను పరిశుభ్రంగా ఉంచాలి: ఎన్ఈఆర్



ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎమ్మెల్యే ఎన్ఈఆర్, జేసీ అహ్మద్‌ఖాన్

రణస్థలం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కార్యాలయాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వర రావు, జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ కోరారు. శనివారం రణస్థలం ఎంపీడీవో కార్యాలయం ప్రాంగణంలో తుప్పలను తొలగించి పరిశుభ్రం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎం.ఈశ్వరరావు, ఈవోపీఆర్డీ ప్రకాశరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఇదేనా స్వచ్ఛ దివస్

- పట్టణంలో ఎక్కడపడితే అక్కడ చెత్త
- వీధులన్నీ కంపుకొడుతున్నాయంటూ స్థానికుల ఆవేదన





టెక్కలి పాత జాతీయ రహదారిపై రోడ్డుపై ఉన్న చెత్త (ఇన్‌సెట్‌లో) కంద్రవీధి జనావాసాల్లో పేరుకుపోయిన చెత్త నిల్వలు

టెక్కలి, జనవరి 18(ఆంధ్రజ్యోతి): ఒక పక్క స్వచ్ఛ ఆంధ్ర..స్వచ్ఛదివస్ చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.. అయితే టెక్కలి పట్టణంలో మాత్రం ఆ ఆదేశాలను తుంగలో తొక్కారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఏ రోడ్డు చూసినా.. ఏ వీధి చూసినా చెత్త కుప్పలు, మురుగు నిల్వలతో దుర్గంధం వెద జల్లుతోందని, ఇదేనా స్వచ్ఛ దివస్ అని పలువురు పట్టణ వాసులు ప్రశ్నిస్తున్నారు. నియోజకవర్గం, మండ ల కేంద్రం, డివిజన్ కేంద్రమైన టెక్కలి లోనే ఇలా ఉంటే ఇతర గ్రామాల్లో ఎలా ఉంటుందోనన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పట్టణంలో పారిశుధ్య పనులపై పంచాయతీ అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోందని పలువురు పేర్కొంటున్నారు. కాలువల్లో పూడికలు పేరుకుపోయినా, రోడ్డుపై చెత్తకుప్పలు దర్శనమిస్తున్నా వారికి పట్టడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. రోజుల తరబడి ఇలాగే ఉన్నా సంబంధిత అధికారులు ఏం చేస్తున్నారని వారు ప్రశ్నిస్తున్నారు. శనివారం నాటి ప్రభు త్వ కార్యక్రమంలో అధికారులు, అధికార పార్టీ నేతలు ఫొటోలకు ఫోజులిచ్చారు తప్ప ఎటు వంటి పనులు జరగలేదన్న వాదనలొస్తున్నాయి.

బెండి కూర్మన్నకు ఘన నివాళి

టెక్కలి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం జిల్లా పరిషత్ మొట్టమొదటి చైర్మన్ టెక్కలికి చెందిన బెండి కూర్మన్న జయంతిని శనివారం ఆయన స్వగ్రామం సీతాపురంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీసీల అభ్యున్నతికి, కాళింగ జాతి ఔన్నత్యానికి కూర్మన్న కృషి చేశారని వక్తలు కొనియాడారు. కార్యక్రమంలో ఖర్మవీరుడు, కరుణాకర్, కొండలరావు, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు ఇన్వర్టర్ బహూకరణ

టెక్కలి, జనవరి 18(ఆంధ్రజ్యోతి): తలగాం ఎట్ నౌపడా ఆర్ఎస్ పాఠశాలలో 2004-5 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు శనివారం ఇన్వర్టర్‌ను అందజేశారు. పూర్వ విద్యార్థులు పేడాడ ఆజాద్, పేడాడ చంద్రశేఖర్, భగత్‌సింగ్, గోపి, లక్ష్మణ, దివ్య, సంతోషి, సంధ్యారాణి హాజరై పాఠశాలలో మౌలిక సదుపాయాలకు అవసరమైన సహకారం అందించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా వీరిని హెచ్ఎం అభినందించారు.

ట్యాంకర్లతో నీటి సరఫరా

పలాస, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): సూదికొండ కాలనీలో నీటి ఎద్దడి ఉన్నందున శనివారం నుంచి ట్యాంకర్లతో నీటి సరఫరా చేపడుతున్నట్లు కమిషనర్ ఎన్.రామారావు తెలిపారు. రెల్లివీధిలో నీటి సమస్య అధికంగా ఉందని, ఈ ప్రాంతంలో అదనంగా ట్యాంకర్లతో నీటిని అందించనున్నా మన్నారు. నీటి సమస్య శాశ్వతంగా తొలగించేందుకు ఎమ్మెల్యే గౌతు శిరీష, చైర్మన్ బళ్ల గిరిబాబుతో చర్చించి బోర్‌వెల్ వేయడం జరుగుతుందన్నారు. స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛదివస్‌లో భాగంగా కమిషనర్ ఎన్.రామారావు ఆధ్వర్యంలో ర్యాలీ, అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్టీఓ జి.వెంకటేష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అపరిచితులిచ్చే పదార్థాలను స్వీకరించొద్దు

పలాస, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): రైల్వే ప్రయాణికులు అపరిచితులు ఇచ్చే ఆహార పదార్థాలు స్వీకరించవద్దని రైల్వే పోలీసులు, ఆర్పీఎఫ్ సిబ్బంది కోరారు. సంక్రాంతి ముగియడంతో ప్రయాణికుల సంఖ్య ఎక్కువగా ఉండడంతో శనివారం రైల్వే స్టేషన్‌లో మైక్ ద్వారా అవగాహన కల్పించారు. రైలులో రాకపోకల ఇబ్బందులకు గురి కావద్దని, బ్యాగులు, విలువైన ఆభరణాలు జాగ్రత్తగా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌సీ సోమేశ్వరరావు, సాహు, లత, చైల్డ్ హెల్ప్ డెస్క్ సూపర్‌వైజర్ బాలసరస్వతి పాల్గొన్నారు.

టీడీపీ కోటి సభ్యత్వాలపై సంబరాలు

నందిగాం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): టీడీపీ కోటి సభ్యత్వాలు పూర్తిచేసుకున్న సందర్భంగా మండల పార్టీ నేతలు శనివారం సంబరాలు చేశారు. స్థానిక కార్యాలయం ఆవరణలో కేక్‌ను కట్‌చేసి పంచిపెట్టారు. కార్యక్రమంలో నేతలు పి.చంద్రశేఖర్, ఎం.బాలకృష్ణ, ఎస్.జానకిరాం, ఎన్.తిరుపతి రావు, కె.విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

శారీరక ఆరోగ్యానికి క్రీడలు దోహదం

పాతపట్నం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): మానసికంగా, శారీరకంగా ఆరోగ్యంగా ఉండేందుకు క్రీడలు దోహదం చేస్తాయని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. లాబరగ్రామంలో గ్రామస్థులు శ్రీరాం రమణ, మాధవరావు, లోకేశ్ సంయుక్త సారథ్యంలో నిర్వహించిన మెగా క్రికెట్ టోర్నమెంట్ శనివారం ముగిసింది. ఈ టోర్నమెంట్‌లో 48 జట్లు పాల్గొన్నాయని నిర్వాహకులు తెలిపారు. విజేతగా లాబర జట్టు, పాతపట్నం జట్టు రన్నర్‌గా నిలిచాయి. విజేతలకు ఎమ్మెల్యే నగదు పురస్కారం అందించారు. కార్యక్రమాన్ని పర్యవేక్షించిన డా. కొండాల చక్రపతిని, క్రీడాకారులను ఎమ్మెల్యే అభినందించారు.

విన్నర్‌గా ఆదివాసీ జట్టు

జలుమూరు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ఎస్టీ మాకివలసలో సంక్రాంతి సందర్భంగా నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌లో ఆదివాసీ జట్టు విజేతగా నిలిచింది. మొత్తం 25 జట్లు పాల్గొనగా ఫైనల్‌కు మాకివలస జట్టు-ఆదివాసీ జట్టు చేరుకోగా ఇరు జట్ల మధ్య హోరాహోరీగా మ్యాచ్ జరిగింది. విజేతగా ఆదివాసీ జట్టు నిలువగా రన్నర్‌గా మాకివలస జట్టు నిలిచింది. మ్యాన్‌ఆఫ్ ది మ్యాచ్ సింహాచలం కైవశం చేసుకోగా, మ్యాన్ ఆఫ్ ది సిరీస్ ఉదయ్‌కు దక్కింది. విజేతలకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు.



విజేత ఆదివాసీ జట్టుకు బహుమతి అందిస్తున్న దృశ్యం

ముగిసిన క్రికెట్ పోటీలు

మెళియాపుట్టి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): వెంకటాపురంలో 10 రోజులుగా జరుగుతున్న అల్లూరు సీతారామరాజు క్రికెట్ టోర్నమెంట్ శనివారం ముగిసింది. మర్రిపాడు జట్టు విన్నర్‌గా, వెంకటాపురం జట్టు రన్నర్‌గా నిలిచారు. విజేతలకు నగదుతోపాటు షీల్డ్‌లను అందించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ లక్ష్మీనారాయణ, మర్రిపాడు సర్పంచ్ అనురాధ గణపతిరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా నవోదయ ప్రవేశ పరీక్ష

కోటబొమ్మాళి/పలాస/నరసన్నపేట/టెక్కలి/పాతపట్నం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): నవోదయ ప్రవేశ పరీక్షలు శనివారం జిల్లాలో వివిధ ప్రాంతాల్లో ప్రశాంతంగా జరిగాయి. కోటబొమ్మాళి, పలాస, నరసన్నపేట, టెక్కలి, పాతపట్నంతోపాటు వివిధ ప్రాంతాల్లో ఈ పరీక్షలు నిర్వహించారు. పరీక్షలకు ఎంఈవోలు పర్యవేక్షించారు. ఉదయం నుంచే విద్యార్థులు, తల్లిదం డ్రులు ఆయా పాఠశాలల వద్ద బారులు తీరారు. విద్యార్థులను పరీక్షా హాలులోకి అనుమతించారు. వారికి ఉపాధ్యాయులు పరీక్ష గదులు చూపించి సహకారం అందించారు. పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.



పలాస: ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద బారులు తీరిన విద్యార్థులు, తల్లిదండ్రులు



టెక్కలి: పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థులు



పాతపట్నం: ఉన్నత పాఠశాలలో హాల్ టికెట్‌లను సరిచూస్తున్న ఉపాధ్యాయులు

న్యూస్ బాక్స్

రేపటి నుంచి పశువైద్య శిబిరాలు

పాతపట్నం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పశువైద్య శిబిరాలను సోమవారం నుంచి 31వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ప్రాంతీయ పశుసంవర్ధక శాఖ ఏడీ డా. మంచు కరుణాకర రావు తెలిపారు. ఈ శిబిరాల్లో పెద్ద పశువులకు, దూడలకు, గొర్రెలకు, మేకలకు డీవార్మింగ్ మందులివ్వనున్నామన్నారు. పాడి రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

18 ఏళ్ల లోపు పిల్లలను పనిలో పెట్టొద్దు

జలుమూరు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): దుకాణాలు, పరిశ్రమల్లో 18 ఏళ్లలోపు బాల బాలికలను పనిలో పెట్టవద్దని, నిబంధనలు పాటించకుంటే చర్యలు తీసుకుంటామని ఏఎల్‌వో శైలేష్ హెచ్చరించారు. చల్లవానిపేట కూడలిలోని పలు దుకాణాలను శనివారం తనిఖీ చేశారు. బాల కార్మిక వ్యవస్థపై బాలల భద్రత, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 సేవలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో చైల్డ్ హెల్ప్‌లైను సూపర్‌వైజర్ ఎస్.వైకుంఠరావు, పీసీ నాగరాజు, సీఆర్‌సి పి.వైకుంఠరావు, కేవీఎస్ఎఫ్ పోలయ్య, సర్వశిక్షా అభియాన్ ప్రతినిధి పి.జనార్దనతదితరులు పాల్గొన్నారు.

సైరిగాంలో తాగునీరు వృథా



జలుమూరు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): సైరిగాం రక్షిత నీటి పథకం నుంచి తాగు నీరు వృథాగా పోతోంది. దీంతో కొళా యిల ద్వారా సక్ర మంగా నీరు రావడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొంతమంది రైతులు కావాలనే రక్షిత నీటి పథకం వద్ద పైపు లైన్‌కు లీకుచేసి వ్యవసాయ సాగుకు ఉపయోగించుకుంటున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రక్షిత మంచినీటి పథకం వద్ద పైపులైను బాగుచేయాలని వారు కోరుతున్నారు.

ఆటో డ్రైవర్లు కంటి పరీక్షలు చేయించుకోవాలి

కొత్తూరు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్లు ఎప్పటికప్పుడు కంటి పరీక్షలు చేసుకోవాలని సీఐ చింతాడ ప్రసాద్ తెలిపారు. రహదారి ప్రమాదాల నివారణ, భద్రతపై ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ఆటో డ్రైవర్లకు ఆప్తాలమిక్ అధికారి ఇప్పిలి జానకిరామయ్య కంటి పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు అందజేశారు.

- నరసన్నపేట, జనవరి 18(ఆంధ్రజ్యోతి): రోడ్డు భద్రత ఉత్సవాల్లో భాగంగా ఎస్ఐ దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లకు శనివారం కంటి పరీక్షలు నిర్వహించారు. రోడ్డు భద్రత నియమాలను పాటించాలని కోరారు. ప్రభుత్వ ఆసుపత్రిలో కంటి పరీక్షలు నిర్వహించడంపై ఆటో డ్రైవర్లు హర్షం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో వైద్యులు స్వాత్రి తదితరులు పాల్గొన్నారు.